J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 09.10.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 19 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com

## ఏ అధికారమూ లేనప్పుడే జంకని జగన్..


# కమలంతో కలవడం కల్లే..!

జగన్ ఢిల్లీ టూర్ ఇప్పుడు రాజకీయ రంగంలో కలకలం సృష్టిస్తోంది. కమలంతో దోస్తీ చేయడానికే ఢిల్లీకి వెళ్లాడని, మూడు కేంద్రమంత్రి పదవులు తీసుకుని కమలం పార్టీకి బయటనుండి మద్దతు పలకడానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నాడని కొందరు విషప్రచారం చేస్తున్నారు.



రాష్ట్రంలో జరుగుతున్న అత్యంత నాటకీయ రాజకీయ పరిణామాలతో జగన్ పార్టీని బలి చెయ్యాలని చూస్తున్న పచ్చ పార్టీ పాచికలు అస్సలు పారడంలేదు. జగన్ బీజేపీతో కలుస్తున్నాడని దుష్ప్రచారాలు చేసి అటు బీజేపీని, ఇటు వైసిపిని నైతికంగా దెబ్బతీయాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంలేదు.

(మిగతా 10వ పేజీలో)



## మన సతీష్‌రెడ్డి....

# మరో చరిత్ర

మన సతీష్‌రెడ్డి దేశ రక్షణ రంగంలో మరో చరిత్ర సృష్టించాడు. శత్రుదేశాల జలాంతర్గాములను మెరుపు వేగంతో ధ్వంసంచేసే అత్యంత ఆధునికమైన టార్పెడోను భారత రక్షణ పరిశోధన అభివృద్ధిసంస్థ (డిఆర్‌డిఓ) ఆధ్వర్యంలో డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడైన సతీష్‌రెడ్డి సారథ్యంలో రూపొందించడం ఎంతో అపూర్వమైన విషయం!..

(మిగతా 10వ పేజీలో)

బీజేపీతో జగన్ దోస్తీ...

అంటూ గాలివార్తలు

ముగ్గురికి మంత్రి పదవులంటూ..

పుకార్ల షికారు

సీఎం ఢిల్లీ టూర్‌ను ప్రతిసారీ

రాజకీయం చేస్తున్న

పచ్చపార్టీ నాయకులు



## బడిపిల్లలకు వెలుగురేఖ

# జగనన్న విద్యా కానుక

పేదింటి బిడ్డలకు గొప్పింటి చదువులు చదువుకునే అదృష్టాన్ని కలిగిస్తూ, ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుకునే భాగ్యాన్ని కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఈనెల 8న ప్రారంభించిన 'జగనన్న విద్యా కానుక' రాష్ట్రంలోనే కాదు, యావత్ దేశంలోనూ సంచలనం సృష్టిస్తోంది.

(మిగతా 11వ పేజీలో)



జననం: 19-11-1945 మరణం: 06-10-2019

## ప్రథమ వర్ధంతి

మా హృదయ ఫలకాలపై చెక్కిన సజీవ శిల్పం మీ రూపం...
అనురాగానికి చిరునామా మీ హృదయం...
మీరు వేసిన ప్రతి అడుగు మాకు మార్గదర్శకం..
అజరామరం మీ ప్రస్థానం... అమరం... అమరం... మా గుండెల్లో మీ స్థానం.

## శ్రీ పూండ్ల దయాకరరెడ్డి గారు

రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్

మమ్మల్ని వీడి తేది. 06.10.2020 నాటికి ఏడాది గడిచిన సందర్భంగా
ఆ పుణ్యమూర్తి దివ్యస్మృతిని స్మరించుకుంటూ...

భార్య: పూండ్ల వేదవతి

కుమారులు - కోడళ్ళు

పూండ్ల వేణుప్రవీణ్‌రెడ్డి - ఉష
పూండ్ల సునీల్‌కుమార్‌రెడ్డి - ప్రసూన

కుమార్తె - అల్లుడు

పాకాల నిషిత - ప్రతాప్‌రెడ్డి

మనుమరాళ్ళు :

మేఘన, స్ఫూర్తి, సాధన, ప్రజ్ఞ, ఆప్న

• తిరుపతి పార్లమెంట్

# ఆశల పల్లకిలో ఆశావహులు...

**క్యూలో... బల్లి కుటుంబం, మేరుగ మురళి, రిటైర్డ్ ఐఏఎస్‌లు రాజకుమార్, పి.వి.రమేష్‌లతో పాటు పనబాక దంపతులు..!**









ఈ నెల 7వ తేదీన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన బల్లి దుర్గాప్రసాద్ భార్య సరళమ్మ, కుమారుడు కళ్యాణ్‌చక్రవర్తి, కోడలు శ్వేత

2019ఎన్నికలలో చివరి నిముషంలో తెరపై మెరిసి తిరుపతి పార్లమెంటు నుండి వైసిపి అభ్యర్థిగా బరిలో దిగి 2,26,061 ఓట్ల మెజారిటీ సాధించి పార్లమెంటు సభ్యుడిగా ఘనవిజయం సాధించి జాక్‌పాట్ కొట్టాడు మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్. అయితే ఆయనకు ఆ ఆనందాన్ని ఎక్కువ రోజులు మిగలనీయకుండానే ఏడాదిన్నరకే మృత్యువు కర్కశ కరోనా రూపంలో ఆయనను పొట్టన పెట్టుకుంది. ఆయన ఆకస్మికంగా కన్నుమూయడంతో ఇప్పుడు తిరుపతి పార్లమెంట్ సీటు ఖాళీ అయ్యింది.

మరపు అన్నది మనిషికి భగవంతుడు ఇచ్చిన పెద్ద వరం, నిదానంగా బల్లి కుటుంబంలో జరిగిన విషాదాన్ని మర్చిపోయిన జనం ఇప్పుడు రాబోయే ఉపఎన్నికలో కాబోయే కొత్త అభ్యర్థి ఎవరని చర్చించుకోవడం మొదలుపెట్టారు. న్యాయంగా అయితే బల్లి వారసుడుగా ఆయన కొడుకు కళ్యాణ్ రావాలి. అయితే ఆ షరతు అసెంబ్లీకి వర్తిస్తుంది తప్ప పార్లమెంటుకి కాదన్న వాదనను ఇప్పుడు కొత్తగా నేతలు తెరపైకి తెచ్చారు.


ఉప ఎన్నికకు ఇంకా చాలా సమయం పట్టొచ్చు, కనీసం 6 నెలల పైమాటే, కానీ ఈలోగా ఆశావహుల క్యూ పెరిగిపోతోంది. ఇప్పటినుండే ఎవరి ప్రయత్నాలు వాళ్ళు మొదలుపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ వైసిపి అభ్యర్థి ఎవరైనా గెలిచేది ఖాయం. పార్టీ, అధికారం, సింపతీ ఇవన్నీ కలిసొచ్చే అంశాలే! కాబట్టి ఇక్కడ ఎన్నికలో జరిగే బహిరంగ పోటీకన్నా అభ్యర్థిగా అవకాశం కోరుకునేవారి అంతర్గత పోటీయే బలంగా వుండబోతోంది. ఇప్పటికే చాలాపేర్లు తెరపైకి వచ్చేశాయి. ముందుగా ఆశిస్తుంది బల్లి కుటుంబం. అక్కడ తమ నాన్న ప్రాతినిధ్యం వహిస్తూ దివంగతులయ్యారు కాబట్టి మొదటి అవకాశం తమ కుటుంబానికే ఇవ్వాలన్నది వారి ఆకాంక్ష. ఈ క్రమంలో బల్లి దుర్గాప్రసాద్ సతీమణి సరళమ్మ, కుమారుడు కళ్యాణ్, కోడలు శ్వేత 7వ తేదీ బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు కూడా. ఇక్కడ రాజకీయ అంశాలు పెద్దగా చర్చకు రాకపోయినప్పటికీ కలయిక వెనుక మర్మం మాత్రం ఆశీస్సుల కొరకే అన్నది సత్యం. ముఖ్యమంత్రి సైతం నర్మగర్భంగా మీ కుటుంబానికి న్యాయం చేస్తామని మాత్రమే హామీ ఇచ్చి పంపినట్లు తెలిసింది.

గత ఎన్నికలలో గూడూరు అసెంబ్లీ టిక్కెట్టు ఆశించి భంగపడ్డ వైయస్ఆర్ పార్టీ జిల్లా మాజీఅధ్యక్షుడు, తిరుపతి పార్లమెంటరీ స్థానిక సంస్థల సమన్వయకర్త మేరుగ మురళి కూడా ఇప్పుడు తిరుపతి పార్లమెంటు వైపు ఆశగా చూస్తున్నాడు. గతంలో మురళికి అన్యాయం జరిగింది కాబట్టి ఈసారి ఆయనకు న్యాయం చెయ్యాలని గూడూరు నాయక గణమంతా ముక్తకంఠంతో ఆయనను బలపరిచే అవకాశాలు కూడా ఉన్నట్లు సమాచారం.

మరోవైపు మాజీ ఐఏఎస్ అధికారులు కూడా ఈ సీటుపై కన్నేసినట్లు భోగట్టా! తమిళనాడు క్యాడర్‌కు చెందిన రాజకుమార్, ఆంధ్రాకు చెందిన పి.వి.రమేష్‌లతో పాటు కొత్త పేర్లు కూడా వినిపిస్తున్నాయి. గత ఎన్నికలలో పిలిచి సీటిస్తామంటే బెట్టు చేసిన పనబాక కుటుంబం కూడా ఇప్పుడు ఇటువైపు చూస్తోందని వార్త. 10 సంవత్సరాలు కేంద్రమంత్రిగా చేసిన అనుభవం, ఢిల్లీలో శక్తివంతమైన లాబీయింగ్ వంటి అర్హతలు పనబాక అభ్యర్థిత్వానికి బలాన్ని చేకూరుస్తాయని ఒక వర్గం వాదన. తిరుపతి ఉప ఎన్నికకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ ఆశావహులు మాత్రం ఆశల పల్లకిలో విహరిస్తున్నారు. టిక్కెట్టు ఎవరికి ...? అన్న విషయం మాత్రం పార్టీ అధిష్టానం చివరివరకు ప్రకటించబోదని, ఆలా ప్రకటించి తలనొప్పులు కొని తెచ్చుకోవడం అవసరం లేదుకాబట్టి, ఆఖరు నిముషంలో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల అభిప్రాయం.

## స్వపక్షం విపక్షం అన్న పంతం మాని..

# ప్రజల పక్షాన నిలవండి



పబ్లిక్ డిమాండ్

రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు ఉండేది ప్రజలకోసమే. తన-మన అన్న భేదం లేకుండా ప్రజలకు కావలసిన సేవలు అందించడం కోసమే మనం ఉన్నాం అన్న సూక్తిని పాటించి, తన దగ్గరకు ఎవరొచ్చినా తాను ఏ పార్టీ, ఏ వర్గం, ఏ కులం, ఏ మతం అన్న తేడాలు చూడకుండా అడిగిందే తడవుగా తనకు చేతనైన సహాయం చేసి పంపించిన మహానేత, దివంగత మాజీముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖరరెడ్డి.

తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన ఇంటికి, క్యాంపు కార్యాలయానికి మధ్య ఏర్పాటు చేసుకున్న ప్రజాదర్బార్‌లో ఆయన ప్రతిరోజూ గంటసేపు సామాన్య ప్రజలతో మమేకమయ్యేవాడు. అక్కడకు వచ్చిన వారి కష్టం ఆయనకు కనిపించేది, వారి బాధలు ఆయనకు వినిపించేవి, వచ్చినవారి పార్టీతో ఆయనకు పని లేదు, వారి కుల మతాలతో ఆయనకు అసలే అవసరం లేదు, తనను నమ్ముకుని వాళ్ళొచ్చారు, వాళ్ళ కష్టం తాను తీర్చాలి.. ఇదే ఆయన అజెండా. అలా చేశాడు కాబట్టే ఆయన దేవుడయ్యాడు. అలా ప్రతి ఒక్కరి సమస్యకు స్పందించాడు కాబట్టే ఆయన పైలోకాలకి వెళ్లి పదకొండేళ్లయినా ఇంకా ప్రజల గుండెల్లో జీవించే ఉన్నాడు. అందుకే ఆయన మానవుడైనా, దేవుడిగా కొలవబడుతున్నాడు.

సెప్టెంబర్ 2, 2009 నుండి ఆయన తలపెట్టిన రచ్చబండ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగివుంటే, ఆ మహానేతే జీవించి ఉండి ఉంటే ఈరోజు రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతిపక్షం అన్న మాటే వినపడేది కాదు, అసలు 'రెండు రాష్ట్రాలు' అన్న పదమే ఉత్పన్నమయ్యేది కాదు. తాను తలపెట్టిన రచ్చబండ కార్యక్రమం ద్వారా ఒకే రాష్ట్రం, ఒకే పార్టీ, ఒకే నాయకుడు అన్న నినాదంతో, ఉమ్మడి తెలుగు రాష్ట్రం భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచేది. తెలుగు ప్రజల దురదృష్టవశాత్తు మృత్యువు ప్రమాదం రూపంలో ఆయనను మనకు లేకుండా చేసింది. ఆ తరువాత 5 యేళ్లు ఆడంగుల పాలనలో రాష్ట్రం రెండు ముక్కలయింది, ఆంధ్రా అంధకారంలోకి వెళ్ళిపోయింది.

ఇప్పుడు రాజకీయాలు అలా లేవు, క్యాంపు రాజకీయాలతో కంపుపట్టిపోయి కొందరికే పరిమితమైపోతున్నాయి. విభజన అనంతరం 5 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన పచ్చ ప్రభుత్వం ఒక వర్గానికే కొమ్ము కాసింది, తమ స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని వారికి తాకట్టు పెట్టింది. అసలే అగాధంలో వున్న రాష్ట్రాన్ని అథఃపాతాళానికి తొక్కేసింది. ఓ కులం, ఓ వర్గం, ఓ మతం అన్న విధానాలకు తెరలేపింది, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో లేని కొత్త పరంపరకు ఆజ్యం పోసింది. ఫలితంగా ఇప్పుడు కక్షలతో, కార్పణ్యాలతో, కుల వివాదాలతో, ఆధిపత్యపోరుతో రాష్ట్రం రగిలిపోతుంటే, సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు. నేతల మధ్య మాటల కోటలు దాటుతున్నాయి, భాష శృతి తప్పుతోంది, వ్యవస్థ గతి తప్పుతోంది.

ఎక్కడకు ఏ పనిమీద వెళ్లినా నువ్వు ఎవరి మనిషివి...? నీది ఏ పార్టీ..?? నీ కులమేమిటి..??? నువ్వు గత ఎన్నికలలో ఎవరికి పనిచేశావు...??? అన్న ప్రశ్నలు ముందుగా వినిపిస్తున్నాయి. ఈ విధానాలకు స్వస్తి పలకాలి. వై.యస్ తరహాలో ప్రజాదర్బార్‌కి మళ్ళీ అంకురార్పణ జరగాలి. ప్రతి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుడు కనీసం వారంలో ఒకరోజు ఇలాంటి ప్రజాదర్బార్‌ను నిర్వహించాలి, అక్కడికి వచ్చే వాళ్ళు ఏ పార్టీ, ఏ వర్గం, ఏ కులం అన్నది చూడకూడదు, వారి సమస్య మాత్రమే వినాలి, వారి బాధలు మాత్రమే చూడాలి. తమకు చేతనైన స్థాయిలో వారికి న్యాయం చేసి పంపాలి. పరాయి పార్టీ వాళ్ళను సైతం తమవైపుకు తిప్పుకోవాలి, ఒకే పార్టీ, ఒకే నాయకుడు అన్న సూత్రాన్ని నేటి నేతలు కూడా పాటించాలి. స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా అంతా ఏకపక్షమే అన్న విధానానికి ప్రతినబూనాలి, అప్పుడే నిజమైన రాజన్న రాజ్యం వస్తుంది. రాష్ట్రంలో ప్రతిపక్షమన్నది కనుమరుగైపోతుంది. ప్రజలు సంతోషంగా ఉంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుంది, రాజ్యం సస్యశ్యామలంగా ఉంటే రాజు రారాజులా వెలిగిపోతాడు.

ముఖ్యమంత్రి జగన్ సైతం ఇదే పదే పదే చెప్తున్నాడు, ప్రజలందరూ తనవాళ్ళే, అందరికీ అన్నీ అందివ్వాలి, తనకు పార్టీలతో పనిలేదు, కులమతాలకు తావు లేదు, వర్గం, వర్ణం అన్న తేడా అసలే లేదు.. అందరూ బాగుండాలి, ప్రజలంతా ఏకపక్షం కావాలి... ఇదీ జగన్ ఆకాంక్ష అలా జరగాలంటే, ముఖ్యమంత్రి ఆశయం నెరవేరాలంటే యంయల్ఏలతో సహా ద్వితీయశ్రేణి నాయకులంతా మారాలి, తమ ప్రవర్తన మార్చుకోవాలి, బెదిరింపు ధోరణిని విడనాడాలి, నియంతృత్వ పోకడలకు స్వస్తి చెప్పాలి... జగన్నినాదంతో జనంలోకి వెళ్ళాలి, "మనమంతా ఒకే జనం - మనదంతా జగనిజం" అనే నినాదంతో అటు పార్టీ భవిష్యత్తుతో పాటు తమ భవిష్యత్తుకు కూడా బంగారు బాటలు వేసుకోవాలి.

## కాలధర్మం


### పందిళ్ళపల్లి పట్టయ్య



పట్టయ్యా అంటూ.. పాతతరం పెద్దోళ్లందరూ ఆప్యాయంగా పిలుచుకునే పందిళ్ళపల్లి పట్టాభిరామరెడ్డి సెప్టెంబర్ 24న హైదరాబాదులో కన్ను మూశాడు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం పనిచేసిన పందిళ్ళపల్లి అరుణమ్మ ఆయన శ్రీమతే! భర్తగానే కాకుండా స్ఫూర్తి ప్రదాతగా కూడా ఆమెకు అన్ని సమయాల్లో తోడుగా నీడగా వుంటూ ప్రోత్సహించేవాడు. ఎప్పుడూ చిరునవ్వే చిహ్నంగా వుండే పట్టయ్య కరోనా మహమ్మారికి బలవడం బాధాకరం. ఆయనకు కుమారుడు హేమంత్, కుమార్తె నిరూప వున్నారు. నెల్లూరు విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగానే కాకుండా డిప్యూటీ గవర్నర్‌గా కూడా ఆయన పని చేశాడు. వాకర్స్ అసోసియేషన్ పక్షానే కాకుండా సత్యసాయి సేవాసమితి తరపున కూడా ఆయన అనేక దాన ధర్మాలు చేసేవాడు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు కూడా జరిపేవాడు. పట్టయ్య మంచి స్నేహశీలి, ఎక్కువ సమయం మిత్రులతో గడిపేవాడు. అరుణమ్మ దూరమయ్యాక స్నేహితులే పట్టయ్యకు ప్రాణవాయువు అయ్యారు. కరోనా పుణ్యమా అని ఆయన చివరిచూపు కూడా ఎవరికీ దక్కలేదు. పట్టయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# నాన్నకు ప్రేమతో

నాన్నా అపురూపంగా పెంచావు.. అభివృద్ధికి అద్భుత బాటలు పరిచావు..
మంచి మనిషిగా పది మందిలో గుర్తింపు పొందావు.. అకాలంగా కాలధర్మం చెంది హృదయం బరువెక్కేలా చేశావు..
మరువురాని మరువలేని నీ స్మృతులు.. మా మదిలో పదిలం. నీకిదే మా నివాళి..



## స్వర్గీయ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి గారు

01-07-1944 - 24-09-2020

కుమారుడు - కోడలు
**పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి - సింధు**

కుమార్తె - అల్లుడు
**నిరూప - చెర్లో కోటారెడ్డి**

మనమరాలు - మనవడు
**కామాక్షి హన్వీతారెడ్డి , వియాన్ష్‌రెడ్డి**

ఉత్తరక్రియలు తేది 14-10-2020 బుధవారం నెల్లూరు బాలాజీ నగర్ లోని మా స్వగృహము నందు జరుగును
( కోవిడ్ నిబంధనల కారణంగా మా కుటుంబ సభ్యుల సమక్షంలోనే జరుపబడునని విన్నవిస్తున్నాము)

## 'ప్రభా'తం

# మరిన్ని మేలైన సంస్కరణలు

**సమాజాన్ని సంస్కరించే ఎలాంటి సంస్కరణలైనా మంచివే. అందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. అయితే ఆ సంస్కరణల అమలు విషయంలోనూ ప్రభుత్వ యంత్రాంగానికి నిబద్ధత ఉండాలి. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ కావాలంటే అధికారులు, ఉద్యోగులు నిబద్ధతతో, నిస్వార్థంతో పనిచేయాలి. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ఆ దిశగా కృషి చేయాలన్న లక్ష్యంతోనే 'మిషన్ కర్మయోగి'ని కేంద్రం ప్రవేశపెట్టడం హర్షదాయకం.**

సమాజాన్ని సంస్కరించే ఎలాంటి సంస్కరణలైనా మంచివే. అందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. అయితే ఆ సంస్కరణల అమలు విషయంలోనూ ప్రభుత్వ యంత్రాంగానికి నిబద్ధత ఉండాలి. అలా కాకుండా సంస్కరణలు చేసేశాం కనుక వాటిపాటికవే ఆచరణలోకి వస్తాయనుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదు. అతి పెద్ద ప్రజాస్వామ్యమైన మనదేశంలో ఎంతోకాలంగా ఎన్నో సంస్కరణలు వస్తూనే ఉన్నాయి. పరిపాలనాపరంగా కూడా సంస్కరణలెన్నో వచ్చాయి. అయితే వాటన్నిటిని అమలులోకి తేవాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిదే. ఈ విషయంలో ఆ యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉంటే కథ మళ్ళీ మొదటికి వస్తుంది. అందుకే అలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాకుండా ఉండేందుకు, ప్రభుత్వోద్యోగుల పనితీరును మరింత మెరుగుపరచేందుకు ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా 'మిషన్ కర్మయోగి' పథకానికి శ్రీకారం చుట్టింది. ఇదెంతో ఆహ్వానించదగిన పరిణా మమే. దీన్ని కొత్త పథకం అనేకన్నా, కొత్త సంస్కరణ అనడమే సరైనది. ఇలాంటి సంస్కరణలు దేశానికి ఎంతైనా అవసరమే. పాలకులు ఎంత మంచి పథకాలు ప్రవేశపెట్టినా అవి అమలులోకి తెచ్చేది పరిపాలనా యంత్రాంగమే కనుక ఆ సంస్కరణలను ప్రజలకు చేరువ చేయాలంటే పరిపాలనా యంత్రాంగంలో కూడా మరిన్ని మేలైన సంస్కరణలు అవసరమని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. అందుకే పరిపాలనలో మరిన్ని మంచి మార్పులు తెచ్చేందుకు, తద్వారా ప్రజల బాగోగులు పట్టించుకునే ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు 'మిషన్ కర్మయోగి'ని కేంద్రం మెరుగుపెడుతోంది.

ఈ పథకం కింద దేశంలోని కోట్లాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అత్యున్నత శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతుండడం ఎంతైనా హర్షదాయకం. ఐఏఎస్‌లు మొదలుకొని కిందిస్థాయిలో ఉన్న ఉద్యోగుల వరకు సుమారు 46 లక్షల మందికి విధి నిర్వహణలో అత్యంత అధునాతనమైన పరిజ్ఞానం, నైపుణ్యత, సేవాభావం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు స్పందించడం వంటి చర్యలను మరింత వేగవంతం చేయడానికి తగిన ఆన్‌లైన శిక్షణ కూడా 'మిషన్ కర్మయోగి' పథకం కింద ఇవ్వడం జరుగుతుందని సమాచారం.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా పరిపాలనా యంత్రాంగాన్ని మెరుగుపరచేందుకు ఎప్పటికప్పుడు వివిధ కమిషన్లు, కమిటీలు వస్తూనే ఉన్నా ఆశించిన ప్రగతి మాత్రం అంతంతమాత్రమే. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మనదేశంలో నేటికీ ప్రజల కష్టాలను తెలిసిన వారు, వారి బాధలను తీర్చాలన్న ధ్యేయంతో పనిచేసే అధికారులు తక్కువే. ఆపదల్లోనో, ఏదైనా సమస్యల్లోనో ఉన్న ప్రజలు ఫోన్ చేసినా పట్టించుకొని అధికారులు, లేదా ఉద్యోగులకు మనదేశంలో కొదవ లేదన్నది అందరికీ తెలిసిందే. ఇక నేరుగా వచ్చి అప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించే నాధులు ఎంతమంది ఉంటారో చెప్పలేం! అందుకే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ కావాలంటే అధికారులు, ఉద్యోగులు నిబద్ధతతో, నిస్వార్థంతో పనిచేయాలి. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ఆ దిశగా కృషి చేయాలన్న లక్ష్యంతోనే 'మిషన్ కర్మయోగి'ని కేంద్రం ప్రవేశపెట్టడం హర్షదాయకం. అందులోనూ ఈ అధునాతన కాలంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతైనా అవసరం కనుక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఆ మేరకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వడానికి 'ఐ గాట్' (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్) అనే డిజిటల్ వేదికను ఏర్పాటు చేసి ప్రపంచంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థల అనుభవాలను రంగరించి కోర్సులను రూపొందించడం, ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేస్తుండడం వల్ల మంచి ఫలితాలుంటాయని భావించవచ్చు. ముఖ్యంగా సివిల్ సర్వీసుల సిబ్బంది పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు కూడా ఈ పథకం కింద కృషి జరుగుతుండడం మంచిదే!

ఏదేమైనా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతమైందిగా ఉండాలి. ఉద్యోగుల మధ్య సదవగాహన, సద్భావన, సమన్వయం ఉంటే తప్ప ప్రభుత్వ పథకాలు ప్రజల దరిచేరవన్నది అందరికీ తెలిసిందే. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల సేవలు మరింత సమున్నతంగా, ఆదర్శవంతంగా ఉంటేనే ఇవన్నీ సాధ్యమవుతాయి. అలా కాక, ప్రభుత్వాధికారులు ఎవరి చిత్తం వచ్చిన రీతిలో వారు వ్యవహరిస్తే ప్రజలు నష్టపోవడమే కాక.. సమాజానికి కూడా ఇబ్బందులు వస్తుంటాయి.

మన రాజ్యాంగం ఎంత బాగా ఉన్నా, పాలకులు ప్రజల కోసం ఎన్నెన్నో రకాల పథకాలు ప్రవేశపెడు తున్నా వాటిని ప్రజలకు చేర్చాల్సింది ప్రభుత్వ యంత్రాంగమేనన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే, తమ పనులు సాధించుకోవాలన్న తపనతో కొందరు రాజకీయనాయకులు తొందర చేయడంవల్ల ప్రభుత్వ అధికారుల్లో ఆందోళన మొదలవడం లేనిపోని సమస్యలకు దారితీయడం జరుగుతుంటుంది. అలాంటివాటికి తావు లేకుండా... అటు రాజకీయ నాయకులు, ఇటు ఉన్న తాధికారుల మధ్య కూడా ఎంతో సహృదయత, సమన్వయం అవసరం. ఒకరిపై ఒకరికి విశ్వాసం లేకపోతే ఎన్ని సంస్కరణలు తెచ్చినా ఆశించిన ఫలితం ఉండదు. అందువల్ల ముఖ్యంగా అధికారులు తమ ఉద్యోగాల ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందన్న సంతోషంతో నిస్వార్థంగా పనిచేసినప్పుడే వారు ప్రజల అభినందనలకు పాత్రమవుతారు.

అటు పాలకులు, ఇటు అధికారులు..ఇలా అందరూ సదాశయాలతో, సేవాభావంతో పనిచేసినప్పుడే ఆచరణలో ఎలాంటి సంస్కరణలైనా సత్ఫలితాలనిస్తాయి. అలాంటి కర్మయోగులే.. దేశాన్ని, ప్రజలను కాపాడే ధర్మయోగులుగా కీర్తినందుకుంటారు. అప్పుడే 'మిషన్ కర్మయోగి' వంటి కార్యక్రమాలు కూడా ఆశించినదానికంటే మరింతగా మెరుగైన ఫలితాలను సాధిస్తూ విజయవంతం అవుతాయి. ఏదేమైనా కేంద్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో.. లక్ష్య శుద్ధితో చేపడుతున్న ఇలాంటి సమున్నతమైన సంస్కరణలు సమాజానికి... దేశానికి వెలుగుదివ్వెలవుతాయని ఆశించవచ్చు.

# బాలు సంచిక బాగుంది

'లాయర్' సంపుటి 40, సంచిక 18 చాలా బాగుంది. గానగంధర్వులు యస్.పి బాలసుబ్రహ్మణ్యం గారి మృతికి ఇది నివాళి సంచిక అయినప్పటికీ దుఃఖ సమయంలో వచ్చిన ఓదార్పు సంచికలా ఆ వారం పత్రికను తీర్చిదిద్దారు. ఇది అందరికీ సాధ్యం కాదు, ఒక ప్రముఖుడు మరణించినప్పుడు ఆ వ్యక్తికి సంబంధించి గతంలో వచ్చిన పుస్తకాల ఆధారంగానో, లేక ఇప్పుడు ఇంటర్నెట్‌లో విరివిగా లభిస్తున్న సమాచారం ద్వారానో ఆయన గురించి తెలుసుకుని రాస్తే అది వార్త అవుతుంది. అయితే ఆ వ్యక్తితో నేరుగా సన్నిహిత సంబంధాలు కలిగి తద్వారా ఏర్పడిన ఎన్నో అనుభూతులను, అనుభవాలను మేళవించి రాస్తే అది హృదయస్పందన అవుతుంది. అలాంటి గుండె చప్పుడే ఆ వారం 'లాయర్'లో వినిపించింది. మీ ప్రయత్నం ద్వారా చాలా మంది మనసులను కదిలించారు.

**పి. లక్ష్మీభరద్వాజ్,** నెల్లూరు.

# సబ్బం హరి.. పరువు పోగొట్టుకున్నాడు

మనిషి ఎంతటి తెలివిగలోడైనా ఒక్కోసారి తొందరపాటు చర్యలతో బొక్క బోర్లా పడతాడు. మాజీ పార్లమెంటు సభ్యుడు సబ్బం హరి విషయంలో కూడా ఇదే జరిగింది. ఇటీవల విశాఖలో ఆయన ఇంటి వద్ద అక్రమంగా కట్టిన బాత్రూం వ్యవహారంతో గుట్టుగా వున్న ఆయన ఒక్క సారిగా బజారునపడ్డాడు. వై.యస్.రాజ శేఖరరెడ్డి గారికి అత్యంత ఆప్తుడిగా సబ్బం హరికి గతంలో మంచి పేరుండేది. వై.యస్ మరణానంతరం ఆయన జగన్మో హన్‌రెడ్డికి బాసటగా నిలిచాడు. తన భాషాపరిజ్ఞానంతో మాట్లాడే పద్ధతితో పార్టీ శ్రేణులను వై.యస్ అభిమానులను కూడా బాగా ఆకట్టుకున్నాడు. అయితే ఆ తరువాత జరిగిన అనేక రాజకీయ పరిణా మాల కారణంగా పార్టీ మారాడు. జగన్‌కి, వైసిపికి దూరమయ్యాడు. ఆయన మాట తీరు, వ్యవహార శైలి చాలా హుందాగా వుంటాయని పేరు.

అయితే, విశాఖలోని ఆయన ఇంటికి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమించి అక్కడ సౌచాలయం కట్టాడని, దానిని తొలగించమని అధికారులు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని, దీంతో అధికార యంత్రాంగం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి సదరు నిర్మాణాన్ని కూల్చేశారని వార్తలొచ్చిన విషయం మనకు తెలిసిందే. ఈ సమయంలో సబ్బం హరి సంయమనం కోల్పోయి బూతుపురాణం మొదలుపెట్టాడని, మళ్ళీ ఆయనే నోరు జారానని క్షమాపణ చెప్పాడని కూడా వార్తలొచ్చాయి.

సబ్బం హరి పార్టీ మారినప్పుడే ఈ కూల్చివేతను ఊహించి ఉండాల్సింది, లేదా పెద్దమనిషి తరహాలో ఆయనే ఈ నిర్మా ణాన్ని తొలగించాల్సింది. అలా చెయ్యక పోగా ఇప్పుడు అధికారులపై బూతులు ప్రయోగించి పరువు పోగొట్టుకున్నాడు. ఇంతటి రాజకీయ పరిజ్ఞానం, సీనియారిటీ వున్న సబ్బం లాంటివాళ్ళు కూడా ఇలాంటి చిన్న వ్యవహారంలో రచ్చకెక్కి పరువు పోగొట్టుకోవడం అర్థరహితం.

**జి.వి.సుబ్బయ్య,** పిడుగురాళ్ల.


లాయర్

పాఠకులకు మనవి

మా(మీ) లాయర్ పత్రికకు

**సమాచారం / లేఖలు**

పంపదలచిన వారు

**9866314741** నంబరుకు

వాట్సాప్ ద్వారా గాని, లేదా

**lawyerpatrika@gmail.com**కి

ఈ-మెయిల్ ద్వారా గాని

పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :

ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-


ఈ-మెయిల్ ప్రజావాణి

roopagroup@yahoo.com

విడవలూరులో...

# ఆక్రమణలు తొలగించండి

నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గం, విడవలూరు మండల కేంద్రంలో పీర్లచావిడి గ్రామ స్టేజీ ఉంది. దాని వెనుక భాగంలోని స్థలం, డ్రైనేజీ కాలువ మొత్తం కబ్జాకి గురైంది. కాలువ మీద గదుల నిర్మాణం చేస్తున్నారు. దీంతో పూడికలు, వ్యర్థ పదార్థాలు తీయాలంటే చాలా అవస్థలు పడాల్సివస్తోంది. పీర్లచావిడి గ్రామ స్టేజీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. గతంలో ఈ స్టేజీ మీద సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహించేవారు. అప్పట్లో ఈ స్టేజీ నిర్మాణం, మరమ్మత్తులకు పనులకు మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అప్పటి జడ్పీ ఛైర్మెన్ నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు ఎంతో కృషి చేశారు. ఈ స్టేజీ మీద ఆ కాలంలో వీధి నాటకాలు, బుర్రకథలు, తోలుబొమ్మలాట, చింతామణి నాటకాలు, పౌరాణిక, జానపద నృత్యాలు నిర్వహించేవారు. ఒక విధంగా పీర్లచావిడి విడవలూరు మండలానికి చిహ్నం లాంటిది. అంతటి ప్రాముఖ్యంగల ఈ స్థలంలోని ఆక్రమణలను అధికారులు తక్షణ చర్యలు తీసుకొని తొలగించాల్సివుంది.

**ఆర్. రాఘవ,** విడవలూరు మండలం, నెల్లూరుజిల్లా.

# నెల్లూరుతో బాలు గారి అనుబంధాన్ని కళ్ళకు కట్టారు!

అక్టోబర్ 2వ తేదీ 'లాయర్' సంచికను "ప్రతి అక్షరం... బాలు కోసం" అంటూ... అద్భుతంగా ఆవిష్కరించారు. సంగీత బ్రహ్మకు నిజమైన నివాళిగా మీరు తెచ్చిన సంచిక నెల్లూరు పట్ల, నెల్లూరీయుల పట్ల మీకున్న కమిట్‌మెంట్‌ను సూచిస్తుంది. నెల్లూరుతో బాలుగారికి వున్న అనుబంధాన్ని, చిన్ననాటి మిత్రులపట్ల ఆయనకున్న స్నేహబంధాన్ని, భాషపట్ల ఆయనకున్న మమకారాన్ని, కుటుంబసభ్యుల పట్ల వున్న వాత్సల్యాన్ని, సేవ పట్ల వున్న సహృదయతని, అన్నింటినీమించి సకలకళలలో ఆయనకున్న అనన్య సామాన్య ప్రతిభాపాటవాలని కళ్ళకు కట్టినట్లు వివరించారు. యావత్ సంగీతప్రపంచం గర్వించ దగిన ప్రతిభాశాలి బాలుగారు. ఆయన ఆకస్మిక నిష్క్రమణం అత్యంత విషాదకరం, విచారకరం. అలాంటి వ్యక్తి మనకు దూరమైన తరుణంలో నిత్యం వుండే వార్తలన్నిటినీ పక్కనపెట్టి ఒక వారం పత్రికను పూర్తిగా బాలుగారికే అంకితం చెయ్యడం ఒక్క 'లాయర్'కే చెల్లింది. పత్రికా ప్రపంచంలో ఇది అరుదైన సంఘటన. మీకు నా అభినందనలు.

**కె. విశ్వేశ్వరరావు,** హైదరాబాదు.

## వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా..

# విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు



నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో ఉన్న 'విపిఆర్ విద్య'లోని విద్యార్థులకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, విపిఆర్ సతీమణి, టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతులమీదుగా ఈ వితరణ కార్యక్రమం జరిగింది. విపిఆర్ విద్య ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లో 7 నుంచి ఇంటర్ దాకా చదువుతున్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఉచితంగా పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమతి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, మెటీరియల్స్ ముందుగానే అందించడం వల్ల విద్యార్థులు పాఠశాలలు ప్రారంభించిన తర్వాత పాఠశాలలకు రావడానికి సిద్ధంగా ఉంటారన్నారు. పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులకు విద్యార్థులందరూ నూరుశాతం హాజరవుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నవంబర్ నుంచి పాఠశాలలను ప్రారంభించాలని భావిస్తోంది కనుక, అందుకనుగుణంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు సిద్ధమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఒ ప్రొఫెసర్ వి. నారాయణరెడ్డి, పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ వి.టి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డా.ఆర్ హరిని కళా తదితరులు పాల్గొన్నారు.

## కండలేరుకు మహర్దశ..

# ఇక నీటికి దిగులుండదు

- ఆధునీకరణకు 951కోట్లు కేటాయించిన సిఎం జగన్
- ఎన్నో ఏళ్ళ నాటి రైతన్నల కల..సాకారం కానుంది

**ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టి డ్యాంగా గుర్తింపు పొందిన కండలేరు జలాశయానికి మంచి రోజులు వచ్చాయి. ఈ జలాశయం జలకళతో ఎప్పుడూ తొణికిసలాడేలా ఉండేందుకు, రైతులకు పుష్కలంగా సాగునీరు, ఇతరప్రాంతాల వారికి త్రాగునీరు అందించేందుకు అవసరమైన ఆధునీకరణ పనులకు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లా రైతాంగంలో హర్షం వెల్లువెత్తుతోంది.**



కండలేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు

రాపూరు మండలంలోని కండలేరు జలాశయంలో నీరు పుష్కలంగా ఉండేందుకు అవసరమైన ఆధునీకరణ పనులకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ఈ పనులకు 951కోట్ల రూపాయల భారీ నిధిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ తాజాగా కేటాయించడంతో కండ లేరులో పుష్కలంగా నీళ్ళుంటే రెండుపంటలకు ఇక దిగులుండదని, సేద్యం పనులు సజావుగా సాగుతాయని భావిస్తున్న రైతుల ఎన్నో ఏళ్ళ నాటి కల సాకారమయ్యేందుకు మార్గం సుగమమైంది.

జిల్లాలోని రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల జలాశయం నుంచి కండలేరుకు వచ్చే వరద నీటి ప్రవాహాన్ని కండలేరు జలాశయానికి పంపినా కాలువల సామర్థ్యం లోపించడంతో ఇంతకాలంగా కండలేరును పూర్తిస్థాయిలో నీటితో నింపలేని పరిస్థితి. ఈ దుస్థితిని రైతులు, జిల్లా ప్రజాప్రతినిధులు ఇటీవల ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకురావడంతో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నారు. దీంతో సోమశిల-కండలేరు వరద ప్రవాహ కాలువ విస్తరణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే ఈ ప్రాంత రైతాంగం సమస్యలు తీరిపోనున్నాయి. భవిష్యత్తులో సోమశిల నుంచి కండలేరుకు వచ్చే వరద ప్రవాహం రెట్టింపు కానుందని రైతులు సంతోషపడుతున్నారు.

### నీళ్ళు పుష్కలంగా ఉన్నా.. ఒక్క పంటకే!..

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన కండలేరు జలాశయానికి సోమశిల ప్రాజెక్టు ప్రధాన జలవనరుగా ఉంది. అప్పట్లో 12వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వరద కాలువను కూడా నిర్మించారు. రోజంతా ప్రవాహం సాగితే ఒక టిఎంసి నీరు మాత్రమే కండలేరుకు చేరుకుంటుంది. పూర్తిస్థాయి సామర్థ్యంతో కండలేరుకు నీళ్ళు చేరాలంటే సుమారు 65 రోజులు పడుతుంది. సోమశిలకు అన్నిరోజుల పాటు ఎగువనీటి ప్రవాహం వచ్చే అవకాశం తక్కువనుక, వరద కొనసాగినన్ని రోజులు మాత్రమే కండలేరుకు నీరు నింపాల్సి వస్తోంది. కేవలం 10వేల క్యూసెక్కుల నీళ్ళు మాత్రమే రోజుకు నింపడం సాధ్యమవుతోంది. దీంతో ప్రవాహంలా వస్తున్న వరదనీటిని విధిలేని పరిస్థితుల్లో వృధాగా సముద్రానికి వదిలేయడం జరుగుతూ వస్తోంది. కండలేరు జలాశయం ద్వారా 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, గూడూరు, తిరుపతి, చెన్నై నగరాలకు తాగునీరు కూడా అందిస్తున్నారు. చెన్నై, కర్నాటక, మహారాష్ట్రలకు వాటాగా మరో 15 టిఎంసిల నీటిని కండలేరు నుంచి పంపుతున్నారు. ఇవన్నీ పోగా కండలేరు ఆయకట్టుకు మిగిలే నీరు ఈ ప్రాంత రైతులకు ఒక పంట సాగుకే అవకాశం ఉంటోంది. గత ఏడాది నీళ్ళు పుష్కలంగా ఉన్నా రెండోపంటకు ఇవ్వలేకపోయారు. ఇక నుంచి ఈ పరిస్థితి మారుతుందని రైతాంగం ఎదురుచూస్తోంది.

### కాలువ విస్తరణకు రంగం సిద్ధం

సోమశిల-కండలేరు కాలువ పొడవు 44 కిలోమీటర్ల దాకా ఉంటుంది. వెడల్పు 22 మీటర్లు. నాలుగున్నర మీటర్ల లోతు కాలువలో 12 వేల క్యూసెక్కుల నీరు పారుదల అవుతోంది. ఈ కాలువను ఇప్పుడు విస్తరించేందుకు ప్రభుత్వం 951 కోట్ల రూపాయలను కేటాయించడం విశేషం. ఈ నిధికి ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ రాగానే పనులు ప్రారంభమవుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రవాహ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తే ఇక ప్రతి ఏటా కండలేరులో నీటిని పూర్తిస్థాయిలో నింపేందుకు అవకాశం ఉంటుంది. రెండు పంటలకు నీరందడంతో పాటు, 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందించే ఈ బృహత్తర యత్నం త్వరలోనే సాకారం కావాలని రైతులు కోరుకుంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

### మొట్టమొదటిసారిగా

### కండలేరులో 51 టిఎంసిల నీరు :

కండలేరు జలాశయం నిర్మించిన తర్వాత మొట్టమొదటిసారిగా ఇప్పుడు 51టిఎంసిల నీరు నిల్వచేశారు. ఈనెల 6న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కండలేరు జలాశయాన్ని పరిశీలించి, 60టిఎంసిల దాకా నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. ఏదేమైనా కండలేరు వరద కాలువ ఆధునీకరణ పనులు ప్రారంభమై త్వరలోనే పూర్తయితే జిల్లాలోని వేలాదిమంది రైతులకు కండలేరు వరప్రసాదినిగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# అంచలంచెలుగా ఎదుగుతున్న సత్యకుమార్

## బిజెపి జాతీయ కార్యదర్శిగా రెండోసారి నియామకం



**భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శిగా వై.సత్యకుమార్ రెండవసారి ఎంపికయ్యారు. పార్టీ చేస్తున్న కార్యక్రమాల పట్ల సత్యకుమార్ చూపిస్తున్న ఆసక్తి, తనకు అప్పజెప్పిన బాధ్యతలలో అయన సాధించిన సత్ఫలితాలు, పార్టీ పటిష్టత కోసం విరివిగా పర్యటిస్తూ సత్యకుమార్ చేస్తున్న శ్రమను మెచ్చి రెండవసారి పార్టీ ఆయనకు జాతీయ కార్యదర్శి పదవిని కట్టబెట్టింది.**

సత్య... ఈ పేరు నెల్లూరీయులకు సుపరిచితమే. మొన్న మొన్నటి వరకు వెంకయ్యనాయుడు అంటే ముందుగా గుర్తొచ్చేది సత్యానే. పూర్తి పేరు సత్యకుమార్ అయినప్పటికీ ఆయన సత్యగానే నెల్లూరీయులకు తెలుసు. పుట్టింది కడపజిల్లా ప్రొద్దుటూరు అయినా ఆయన అనుబంధమంతా నెల్లూరోళ్లతోనే. వెంకయ్య కార్యదర్శిగా 23 సంవత్సరాలు పనిచేశాడు, తద్వారా నెల్లూరుకు సత్య దత్తపుత్రుడయ్యాడు. విద్యార్థి దశనుండే రాజకీయాల పట్ల ఆసక్తితో నాయకత్వపు లక్షణాలు పుష్కలంగా కలిగి ఉండడమే కాకుండా తాను పాలిటెక్నిక్ చదివే రోజుల్లోనే రాయలసీమలో ఫ్యాక్షనిజం, నక్సలిజంలను వ్యతిరేకించడంతో పాటు విద్యార్థి హక్కుల కోసం అయన పోరాటాలు చేసేవాడు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలపట్ల ఆకర్షితుడై వెంకయ్య వద్ద శిష్యుడిగా చేరి వివిధ హోదాలలో పనిచేశాడు.

వెంకయ్య దగ్గర ఉన్నప్పుడే ఆయన పార్టీ దృష్టిని ఆకర్షించాడు, సత్యతో ఒకసారి పరిచయమైతే చాలన్నంత ఆత్మీయతను పార్టీ పెద్దలందరిదగ్గర సంపాదించుకున్నాడు, ఆయన ఎక్కడున్నా సత్యాజీ అంటూ అందరూ ఆయనను కలవరించేవారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో వెంకయ్యనాయుడు వేసిన ఎన్నో కీలక అడుగులలో దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు సత్యా పాత్ర ప్రధానంగా ఉండేదంటే అతిశయోక్తి కాదేమో. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా రాజ్యాంగ పదవిలోకి వెళ్లిపోవడంతో వెంకయ్య జాడ నుండి పార్టీ నీడలోకి వెళ్ళిపోయాడు సత్య.

యువకుడు, ఉత్సాహవంతుడు, కార్యదక్షత కలిగినవాడు, సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తును ఆకాంక్షించిన వాడూ, సహజంగానే తాను అనుకున్నది సాధించే దిశగా పయనించడం ధర్మం. సత్య అదే చేశాడు, వ్యక్తి సేవనుండి పార్టీ సేవవైపు తన ప్రయాణాన్ని మార్చుకున్నాడు. పార్టీలో సొంతంగా అడుగు పెట్టిన రోజునుండి ఎన్నో కీలక బాధ్యతలను తన భుజాలపైకి ఎత్తుకున్నాడు. పాతికేళ్లుగా తనకున్న రాజకీయ అనుభవాన్ని ఇప్పుడు పార్టీ కార్యక్రమాలకు వినియోగిస్తూ పార్టీని ప్రజలకు చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నాడు. తనపై నమ్మకంతో పార్టీ తనపై పెట్టిన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వహిస్తూ తన బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకుంటున్నాడు. ఆయనలోని చురుకుతనాన్ని, కలుపుగోలుతనాన్ని, నిబద్ధతని, క్రమశిక్షణని గుర్తించిన పార్టీ ఆయనకు రెండోసారి జాతీయ కార్యదర్శిగా అవకాశం కల్పించింది. తన కృషితో, కార్యదక్షతతో, సమర్థతతో, పట్టుదలతో అంచలంచెలుగా ఎదుగుతున్న నెల్లూరు దత్తపుత్రుడు సత్య భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలు అధిరోహించి గురువుకు తగ్గ శిష్యుడిగా రాణించాలని నెల్లూరీయుల ఆకాంక్ష. అల్ ది బెస్ట్ టు "సత్య".

## బాలు స్మృతికి..

# ఆత్మీయ నివాళి



భారతీయ సినిమా గాయకులు, గానగంధర్వులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గారి దశదిన కర్మలు అక్టోబర్ 3, 4వ తేదీలలో చెన్నై, రెడ్‌హిల్స్ సమీపంలో గల తామరైపాక్కంలోని వారి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఆయన 'స్మృతివనం' వద్ద, మరియు 5, 6తేదీలలో మద్రాసులోని ఆయన స్వగృహంలో జరిగాయి. ఈ కార్యక్రమాలలో పలువురు బాలు మిత్రులు, ఆప్తులు, ఆత్మీయులు, బంధువులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

# నెల్లూరు కబుర్లు

## విజిలెన్స్ ఆర్‌విఇఓగా రాజేశ్వరరెడ్డి

నెల్లూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌విఇఓ)గా కె.రాజేశ్వరరెడ్డి ఈనెల 6న బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న ఎస్‌వి శ్రీధరరావు గత మే నెలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఓయస్డీగా ఉన్న వెంకటనాథ్‌రెడ్డి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరు డిఎస్పీగా పనిచేస్తున్న కె.రాజేశ్వరరెడ్డి ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నతి పొందడంతో, తాజాగా ఆయన్ను నెల్లూరు జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి(ఆర్‌విఇఓ)గా నియమించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరెడ్డిని ఓయస్డీ వెంకటనాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మాణిక్యాలరావు, సుధాకర్‌రెడ్డి, పివి నారాయణ తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### జెఇఇ ఫలితాల్లో..

## సత్తా చాటిన 'విశ్వసాయి'



జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. పి.జ్ఞానేందర్‌రెడ్డి జాతీయస్థాయిలో 11వ ర్యాంకు, ఎం. వెంకటదినేష్ 1342వ ర్యాంకు సాధించారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ సత్య నారాయణ, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్‌లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు ఈనెల 5న కళాశాలలో జరిగిన కార్య క్రమంలో అభినందించారు.

## విఎస్‌యు వాలంటీర్ల ప్లాస్మా దానం

నెల్లూరులోని విఎస్‌యు ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకెఎస్ వాలంటీర్లు ఈనెల 6న నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ప్లాస్మాదానం చేసి తమ సేవాభావం చాటుకున్నారు. వాలంటీర్లు సాయి ముని, అజీజ్, రాహుల్ ఇటీవల కోవిడ్ వైరస్‌ను జయించి ప్లాస్మా దానానికి ముందుకు రావడం ఎంతో సంతోషదాయమని ఈ సందర్భంగా విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి వారిని అభినందించారు.

### కరాటే క్రీడాకారుడిని

## అభినందించిన మంత్రి అనిల్



జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చూపిన నెల్లూరు కరాటే క్రీడాకారుడు మహమ్మద్ సమీర్‌ను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అభినందించారు. ఈనెల4న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన అభినందన సభలో ఆ క్రీడాకారుని ప్రతిభను మంత్రి కొనియాడారు. కరాటే మాస్టర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

## హాథ్రస్ నిందితులను శిక్షించాలి

ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్‌లో దళిత యువతిపై లైంగిక దాడికి పాల్పడి, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీమాంధ్ర ఎమ్మార్పీయస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య డిమాండ్ చేశారు. హాథ్రస్ ఘటనకు నిరసనగా ఈనెల 4న ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. ఈ ఆందోళనలో నాయకులు లేబూరు సురేష్, బద్దెపూడి కృష్ణయ్య, సురేష్, ఏడుకొండలు, పాలిచర్ల శ్రీనివాసులు, పాములు హరిప్రసాద్, ముదిగొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జిజిహెచ్‌లో లిక్విడ్ ఆక్సిజన్ వ్యవస్థ

నెల్లూరులోని జిజిహెచ్ కోవిడ్ ఆసుపత్రిలో కరోనా రోగుల అవసరాల కోసం మరో లిక్విడ్ ఆక్సిజన్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఈనెల 6న దీనికి సంబంధించిన ట్యాంకును క్రేన్ సాయంతో అమర్చారు. దీంతో ఇప్పటికే ఉన్న 10 వేల లీటర్ల ట్యాంకుకు అదనంగా 13వేల లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ అందుబాటులోకి తెచ్చారు. కరోనా రోగులకు అవసరమైన ఆక్సిజన్ సరఫరాలో ఆటంకాలు రాకుండా, రెండుమూడు రోజులకు ఒకసారి ట్యాంక్‌ను నింపే అవసరం లేకుండా ఈ సదుపాయం ఏర్పాటు చేసినట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

### దివ్యాంగులకు

## రిజర్వేషన్లు కల్పించాలి

**- డిఆర్‌ఓకు వినతి**

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను భర్తీచేసే సందర్భాల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల మహాసేన నాయకులు ఈనెల 6న నెల్లూరులోని డిఆర్‌ఓ ఎంవి రమణకు వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులకు వైయస్సార్ చేయూత పథకాన్ని కూడా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యాదగిరి, వెంకటరంగనాథ్, కిరణ్‌కుమార్, రంజిత్‌కుమార్, ప్రసాద్, రమణయ్య, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సేవాసంఘాల

## సమితి కార్యవర్గం

బ్రాహ్మణ సేవాసంఘాల సమితి జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 4న నెల్లూరులోని రేబాల వారివీధిలో ఉన్న అయలూరాు వెంకయ్యపంతులు సత్రంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా మహిళా, యువజన, అర్చక, పురోహిత సంఘాల నగర యువజన విభాగాలను ఎంపిక చేసుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా కొత్త సురేష్ కుమార్, కోశాధికారిగా శ్రీనివాస రంగరాజన్ తదితరులతో కార్యవర్గం ఏర్పాటైంది. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

### సీనియర్ సివిల్‌జడ్జిగా

## బాలాజీ

నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కెపి బాలాజీ నియమితులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో సీనియర్ సివిల్‌జడ్జిగా ఉన్న ఆయన్ను నెల్లూరుకు బదిలీచేస్తూ రాష్ట్ర హైకోర్టు ఈనెల 5న ఉత్తర్వులు జారీచేసింది.

### పేదలకు

## నిత్యావసర సరుకులు

నెల్లూరు నగరంలోని పెన్నా నది సమీపంలో ఉన్న దోసకాయల దిబ్బ ప్రాంతంలోని పేదలకు స్థానిక అద్భుత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సాల్మన్, వంశీ, జశ్వంత్, డింపుల్, షాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు

**- విచారణ జరపాలంటూ టిడిపి నాయకుల వినతి**



జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ అధికారులు, ప్రత్యేక అధికారుల బృందాలచే విచారణ జరిపించాలంటూ టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఈనెల 5న నగరంలోని పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రోజ్‌మాండ్‌కు విజ్ఞాపనపత్రం సమర్పించారు. ఎడగారు సీజన్లో రైతుల వద్ద నుంచి దళారులు, వైకాపా నాయకులు తక్కువ ధరకే ధాన్యం కొనుగోళ్ళు చేసి రైతులకు నష్టం కలిగించారని, దీంతో ఎకరాకు సుమారు పాతికవేల రూపాయల దాకా రైతులు నష్టపోయారని వారు పేర్కొన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటూ ప్రభుత్వం ఎకరాకు 15 వేలరూపాయల వంతున పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రావూరి రాధాకృష్ణమనాయుడు, బొమ్మి సురేంద్ర, దశరథనాగేంద్రప్రసాద్, గుమ్మడి రాజా యాదవ్, జలదంకి సుధాకర్, తిరుమలనాయుడు, అమృల్లా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలు సేవలు చిరస్మరణీయం

**భిక్షాటనాపూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవ సభ నివాళి**



అటు సంగీతరంగానికే కాక, సామాజిక రంగానికి కూడా గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎనలేని సేవలందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని నెల్లూరులోని భిక్షాటనాపూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవ సభ నివాళులర్పించింది. ఈనెల 3న నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న శ్రీ త్యాగరాజస్వామి ఆలయంలో బాలు సంతాపసభ నిర్వహించారు. వక్తలందరూ బాలు మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాలు లేని లోటు తీరనిదని అంటూ శోకతప్తహృదయాలతో బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సభ సభ్యులు వై.నాగదేవిప్రసాద్, చతుర్వేదుల రామ చంద్రయ్య, ఎస్. హనుమంతరావు, పి.వి ప్రసాద్, టి.వెంకటేశ్వర్లు, పామర్తి బలరామ్, ఎస్.మాధవరావు, టిఆర్ చంద్రమౌళి, ఎస్.నాగేశ్వర్‌తో పాటు భరద్వాజ రుద్రాభిషేకం సంఘం సభ్యులు యద్దనపూడి ధనుంజయ, పంచాగ్నుల హరిప్రసాద్, అనంతబొట్ల ప్రసాద్, ప్రముఖ సంగీత కళాకారులు డివి సురేష్‌రావు, ఏ.లక్ష్మీప్రసన్న, వి.శాంతి కళాధర్ తదితరులు పాల్గొన్నారు.


### స్నేహానికి ప్రతిరూపం బాలు...

మా బాలు.. స్నేహానికి ప్రతిరూపం.. అందరినీ ఎంతగానో అభిమానించి ప్రేమించే బాలు... ఇక లేరనే బాధే మాకు తీరని శోకం కలిగిస్తోంది.. అంటూ నెల్లూరులోని బాలు మిత్రులు కంటతడిపెట్టారు.

గతనెల 30న నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఎస్పీబి సంతాపసభలో పాల్గొన్న పలువురు వక్తలు, బాలు మిత్రులు మాట్లాడుతూ బాలుతో స్నేహంగా గడిపిన అనుభూతులను జ్ఞాపకం చేసుకుని కన్నీరుపెట్టుకున్నారు. బాలు సేవలకు గుర్తుగా నెల్లూరు కేంద్రంగా సంగీత విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లంచేటి చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలుకు 'భారత రత్న' ఇవ్వాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని కోరడంపై అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీబి బాల్యమిత్రుడు ఎంకె ప్రసాద్ మాట్లాడుతూ స్నేహానికి బాలు ఎంత విలువనిస్తారో తనకున్న అనుభవాలను వివరించి బాలు స్నేహానికి పాత్రులం కావడం మన అదృష్టమన్నారు. ఈ సభలో బాలు అభిమానులు వై.నాగరాజారావు, విస్సా రామచంద్రరావు, కనుపర్తి శ్రీనివాసమూర్తి సురభి రాజశేఖర్, దుర్గాప్రసాద్‌రావు, టిపి భాస్కర్, డిటి హరికృష్ణ పాల్గొన్నారు.

### కాలధర్మం

## వినయబాబు



కోరా విద్యాసంస్థల మాజీ డైరెక్టర్ భీమా వినయబాబు అక్టోబర్ 7 వతేది బుధవారం సాయంత్రం తిరుపతిలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 70సంవత్సరాలు. వినయ బాబుకు భార్య మాధురి, కుమారుడు తరుణ్, కుమార్తె తన్వి ఉన్నారు. ఇందుకూరుపేట మండలం సోమరాజుపల్లి ఆయన స్వగ్రామం. విఆర్ కళాశాల రిటైర్డ్ ఇంగ్లిష్ అధ్యాపకుడు నరసయ్య, పంకజమ్మల సంతానం వినయబాబు.

1980వ దశకంలో ఇంటర్మీడియట్ చదువుకున్న యంపిసి విద్యార్థినీవిద్యార్థులలో లెక్కలమాష్టారు వినయబాబు అంటే తెలియని వారు ఉండరు. తన విద్యార్థులతో తానూ ఒకడిగా కలిసిపోయి వాళ్ళని తన స్నేహితుల్లా చూసేతత్వం వినయబాబుది.

దాదాపు 10సంవత్సరాలు ట్యూషన్లు చెప్తూ 1990లో రాజగోపాల రెడ్డి, కోదండరామయ్య, రామకృష్ణారెడ్డి, నరసింహులులతో పాటు తానూ ఒక డైరెక్టర్‌గా కోరా విద్యాసంస్థలను స్థాపించారు. అనతికాలం లోనే విశేషగుర్తింపును పొందిన కోరా... తరువాతికాలంలో కనుమరుగై పోవడంతో తన అధ్యాపక వృత్తిని ఇతర సంస్థలలో కొనసాగించాలని ప్రయత్నించిన వినయబాబు.. ఎక్కడా ఇమడలేకపోయాడు. తన మకాంను తిరుపతికి మార్చుకుని అక్కడే విశ్రాంత జీవితం గడుపుతూ తుదిశ్వాస విడిచాడు. కొద్దిరోజులుగా ఆయన కామెర్ల వ్యాధితో బాధ పడుతున్నట్లు తెలిసింది. అమెరికాలో వున్న ఆయన కుమారుడు వచ్చిన అనంతరం శనివారం అక్టోబర్ 10వతేదీన ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. వినయబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### ధాన్యం కొనుగోళ్లలో..

# అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు

**- మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**



ధాన్యం కొనుగోళ్ళలో ఎవరైనా అవక తవకలకు పాల్పడితే, రైతులకు నష్టం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి హెచ్చరించారు. జిల్లాలో ఈ ఎడగారు సీజన్‌లో సెప్టెంబర్ నెలాఖరు నాటికే రికార్డు స్థాయిలో 2.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు జరిగాయని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్‌రెడ్డి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్ల కుండా చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, మిల్లర్లు రైతుల నుంచి కాకుండా దళారుల ద్వారా కొనుగోళ్ళు చేయిస్తే సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎప్పటి కప్పుడు ఈ విషయాలపై ముఖ్యమంత్రి సమీక్షిస్తున్నారని, ఎక్కడా ఎలాంటి అవక తవకలు జరగకుండా చూడాలని ఆయన పౌరసరఫరాల శాఖ డి.ఎం రోజ్‌మాండ్‌ను ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిఘా ఏర్పాటుచేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ద్వారా 2016-17 ఎడగారు సీజన్‌లో 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు జరిగాయని, 2017-18లో 15 వేల టన్నుల, ఈ ఏడాది ఈ సీజన్‌లో సెప్టెంబరు ఆఖరుకల్లా 2.38 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్ళు జరగడం అభినందనీయమన్నారు. ఈ నెలాఖరులోగా మరో 50వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 12 గోదాములు అందుబాటులో ఉన్నాయని, వాటిలో రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల దాకా ధాన్యాన్ని నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. 1.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని గోదా ముల్లో భద్రపరిచామన్నారు. రైతులకు మేలు చేసేవిధంగా ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం అన్నివిధాలైన ఏర్పాట్లు చేస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డిఎం రోజ్‌మాండ్ పాల్గొన్నారు.

# అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టిస్తున్న.. ఇస్రో



**- షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్**

అంతరిక్ష ప్రయోగాల్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎన్నో ఘనవిజయాలను సొంతం చేసుకుని ప్రపంచవ్యాప్తంగా కీర్తిగడిం చిందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఈనెల 5న ఆయన షార్ నుంచి వెబ్‌నార్ ద్వారా ప్రసంగించారు. దేశంలోని సగటు మనిషికి అంత రిక్ష సాంకేతిక ఫలితాలను ఇస్రో అందజేస్తోం దని ఆయన అన్నారు. దాదాపు అయిదు దశాబ్దాల ఇస్రో చరిత్రలో ఎందరో అంతరిక్ష రంగ పితా మహులు చేసిన కృషితో ఇప్పటికి 77 రాకెట్ ప్రయోగాలు, 109 ఉపగ్రహాలు, 10 స్టూడెంట్స్ శాటిలైట్స్, 2 రీఎంట్రీ మిషన్లు, 319 విదేశీ ఉపగ్రహాలను నింగిలోకి పంపామని, అత్యధిక ఉపగ్రహాలను ప్రయోగించి ప్రపంచంలోనే నాల్గవ స్థానంలో నిలిచా మన్నారు. ఇందులో పిఎస్ఎల్‌వి రాకెట్లు 50 వరకు ఉ న్నాయని, పిఎస్ఎల్‌వి ద్వారానే చంద్రయాన్-1, చంద్రయాన్-2, మంగళ యాన్-1తోపాటు ఇంకా ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షం లోకి పంపి చరిత్ర సృష్టించామని చెప్పారు. 5 రకాల రాకెట్లు, 8 రకాల ఉపగ్రహాలను సొంతంగా తయారుచేసుకుని ప్రయోగించే స్థాయికి ఎదిగామని, షార్ కేంద్రం అన్ని వసతులు కలిగిన ప్రపంచస్థాయి అంతరిక్ష కేంద్రంగా నిలిచిందన్నారు. దేశంలో సంభవించనున్న వరదలు, భూకంపాలు వగైరాల గురించిన ముందస్తు సమాచారం తెలియజేసి హెచ్చరించడం ద్వారా ఆయా విపత్తుల నష్టాన్ని తగ్గించగలిగా మని తెలిపారు. నేటితరం విద్యార్థులు ఇస్రో వైపు అడుగులు వేసేందుకు వారు తయారుచేసిన చిన్న ఉపగ్రహాలను ఉచితంగా ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్నా మన్నారు. చిన్న చిన్న ఉపగ్రహాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఇస్రో ఎస్ఎస్ఎల్‌వి రూపకల్పనకు ఎంతో ప్రాధాన్యత నిస్తోందని ఆయన తెలిపారు. ఇస్రో ద్వారా చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపేందుకు విదేశాలు పోటీ పడుతున్నాయ న్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఎస్ఎల్‌విని నిర్మిస్తున్నా మన్నారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

# రైతుల్ని దోచుకుంటున్నారు

**ఆనం వెంకటరమణారెడ్డి విమర్శ**

జిల్లాలో ఈ ఎడగారు సీజన్‌లో రైతులను దళారుల ముసుగులో వైకాపా నాయకులు నిలువునా దోచుకుంటున్నారంటూ టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ ఈ దోపిడీ గురించి టిడిపి నాయకులు సోమిరెడ్డి జిల్లా కలెక్టర్‌కు కూడా తెలియజేశారన్నారు జిల్లాలోని టిడిపి నాయకులు, రైతు సంఘాలు, ఇతర ప్రతిపక్షాలు అన్నీ గగ్గోలుపెడుతున్నా వైకాపా నాయకులు కానీ మంత్రులు కానీ జిల్లాలోని రైతుల దీనావస్థ గురించి పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వస్తున్నా ఈ అక్రమాలను అరికట్టే నాథులే లేరని, దీంతో రైతులు పడే బాధలు వర్ణనాతీతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా నాయకుడు కాకాణి అడ్డగోలు మాటలతో దళారులకు మద్దతు పలుకుతూ రైతులను ముంచేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్ళలో జరిగిన అక్రమాలపై నిష్పాక్షికంగా విచారణ జరిపించి రైతులను నష్టాలకు గురిచేస్తున్న నాయకులు, దళారులపై కఠిన చర్యలు తీసుకొని ఈ అన్యాయాలను ఇకనైనా అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పిట్టి సత్యనాగేశ్వరరావు, కప్పిర శ్రీనివాసులు, వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



# సొంత భవనాల్లోకి.. సచివాలయాలు

**కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్**

నెల్లూరు నగరంలో ప్రస్తుతం అద్దె భవనాల్లో ఉన్న డివిజన్ సచివాలయాలను త్వరలోనే సొంత భవనాల్లోకిమ మార్చేందుకు కృషి చేస్తున్నామని నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ చెప్పారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని మూలాపేటలో ఉన్న 40, 41వ డివిజన్ల పరిధిలో 'గుడ్‌మార్నింగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి నిధులు 5 లక్షల రూపాయలతో నిర్మించిన తాగునీటి ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలన్నిటినీ సొంత భవనాల్లోకి మార్చేందుకు చర్యలు ప్రారంభించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నెల్లూరు నగరంలో మరమ్మతులకు గురై ఉన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేయించాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆయన ఆదేశించారు. మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైకాపా నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, చాట్ల నరసింహారావు, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసిటీలో

# 'దిశ' సహాయకేంద్రం



శ్రీసిటీలోని మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, పరిసర గ్రామాల మహిళల సమస్యల పరిష్కారానికి 'దిశ' సహాయ కేంద్రం ప్రారంభమైంది. ఈనెల 5న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఆయన సతీమణి మమత సన్నారెడ్డి ఈ కేంద్రాన్ని తమ చేతుల మీదుగా ప్రారంభించారు. శ్రీసిటీలో వివిధ రాష్ట్రాలు, వివిధ జిల్లాలకు చెందిన సుమారు 25వేల మందికిపైగానే మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ఉండడంతో ఈ కేంద్రం ఏర్పాటు వారికి ఉపయోగకరంగా ఉంటుందని శ్రీసిటీ ఎం.డి తెలిపారు. స్వల్ప వ్యవధిలోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేసినందుకు శ్రీసిటీ ఎం.డి ఈ సందర్భంగా డిఎస్పీ విమలకుమారిని అభినందించారు. ఈ కేంద్రాన్ని శ్రీసిటీకి మంజూరు చేసినందుకు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ డిఎస్పీ విమలకుమారి మాట్లాడుతూ వివిధ సమస్యలతో మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించడంతో పాటు వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఈ 'దిశ' సహాయ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇది ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తుందని, ఒక మహిళా పోలీస్ ప్రతినిధి ఎప్పుడూ అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు.

## విద్యార్థులకు డెస్కులు పంపిణీ




శ్రీసిటీలోని ఆస్ట్రోటెక్ పరిశ్రమ యాజమాన్యం శ్రీసిటీ పరిధిలోని నాలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు డెస్కులు, ఇరుగుళం జడ్పీ హైస్కూలుకు ల్యాబ్ పరికరాలు అందజేసింది. ఈ నెల 6న ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో తుండూరుకు 15, గొల్లపాలెంకు 11, రామచంద్రాపురానికి 5, మల్లవవారిపాళెం ఈస్ట్‌కు 8 అందజేశారు. మిగిలిన 11 డెస్కులు వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నారు. సుమారు 3లక్షల రూపాయల విలువైన డెస్కులు, ల్యాబ్ పరికరాలను శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్ట్రోటెక్ వైస్‌ప్రెసిడెంట్ గణేష్, ఇతర కంపెనీ ప్రతినిధులు ఆయా పాఠశాలలకు పంపిణీ చేయగా, వారిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

### శ్రీసిటీ ఆవరణంలో..

## శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



శ్రీసిటీ పరిధిలోని ఆరూరు గ్రామ సమీపంలో ఉన్న శ్రీసిటీ నర్సరీ ఆవరణంలో కొత్తగా నిర్మించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 3వతేది శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్ఛరణల మధ్య, మంగళవాయిద్యాల మధ్య ఈ వేడుక నయనానందకరంగా సాగింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుంచి గణపతిపూజ, వాస్తు పూజ, అష్టదిక్పాలక పూజ, కలశారాధన, నవగ్రహ పూజ, హోమం తదితర విశిష్టపూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు విష్వక్సేనపూజ చేశారు. శనివారం ఉదయం 7-9.30 గంటల మధ్య కలశారాధన, ప్రధాన దేవతా ఆవాహం, హోమం, వేదపారాయణం నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించడం తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరూరు, ఆరూరుకండ్రిగతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు, శ్రీసిటీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఆలయం వద్ద శ్రీసిటీ యాజమాన్యం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకించి పెరటాశి నెల మూడవ శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అత్యంత విశేషమైన రోజు కనుక ఆ రోజున స్వామివారిని దర్శించుకోవడం ఆనందం కలిగిస్తోందని ఆరూరు వాసులు తెలిపారు.

### ముఖ్యమంత్రి జగన్ సారధ్యంలో

# మెరుగైన పాలన

**ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన పాలన అందుతోందని, దీంతో ఎంతోకాలంగా ఉన్న తమ అవస్థలు తీరుతున్నాయంటూ ప్రజలు సంతోషపడుతున్నారని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 5న మండల కేంద్రమైన సీతారామపురంలో ఏర్పాటుచేసిన రెండు సచివాలయాలను ఎమ్మెల్యే మేకపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారమవుతున్నాయన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రారంభించిన అనేక ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడు తున్నాయని, అర్హులైన వారందరికీ పథకాలు చేరువవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న జగన్మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్‌లు అల్లూరురాజు, దుర్గాప్రసాద్, పంచాయతిరాజ్ డిఓ సుబ్బారెడ్డి, ఏఇ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు వాసికి అరుదైన గౌరవం

ఆత్మకూరు పట్టణంలోని జెఆర్‌పేటకు చెందిన మలినేని కొండయ్య కుమారుడు డాక్టర్ మలినేని శ్రీకాంత్‌కుమార్‌కి ఎంతో అరుదైన గౌరవం దక్కింది. దంత వైద్యంలో దేశంలో అత్యున్నత సేవలందించిన వందమంది వైద్యుల జాబితాలో శ్రీకాంత్‌కుమార్‌కి స్థానం లభించడం ఎంతో విశేషం. గ్లోబల్ ఔట్రీచ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ వారు ఇందుకు సంబంధించిన ప్రతిష్టాత్మక అవార్డును ఈనెల6న డాక్టర్ శ్రీకాంత్ కుమార్‌కు అందజేశారు. డాక్టర్ శ్రీకాంత్ 2019లో సౌదీ అరేబియాలో చిన్నపిల్లల దంత వైద్య విభాగంలో 'యంగ్ రీసెర్చిస్కాలర్' అనే ప్రతిష్టాత్మక అవార్డును కూడా పొంది ఉన్నారు. ఇవేకాక వైద్యరంగంలో ఎంతో సేవలందిస్తూ ఎన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులందుకుంటున్న ప్రతిభాశాలి డాక్టర్ శ్రీకాంత్. మధ్యతరగతి కుటుంబంలో జన్మించినా ఎంతో కష్టపడి చదువుకుని వైద్యవృత్తి చేపట్టి సమాజానికి ఎనలేని సేవలందిస్తున్న శ్రీకాంత్‌ను ఆత్మకూరు వాసులే కాక, జిల్లా ప్రజానీకమంతా అభినంది స్తున్నారు. డాక్టర్ శ్రీకాంత్ ప్రస్తుతం బెంగుళూరులో దంతవైద్యులుగా సేవలందిస్తున్నారు.

## మరువలేము మిమ్ము ఏనాటికీ...



సంగీతం ఏమీ తెలియదంటూనే
సుస్వర గానంతో ఓలలాడించావు
నవ్విస్తూ, కవ్విస్తూ, కంటతడి పెట్టిస్తూ
పాటలకు ప్రాణం పోశావు
పాటనే పంచామృతంగా అందరికీ పంచావు
గానగంధర్వుడవై..గళం విప్పి
ప్రపంచస్థాయిలో మహాగాయకుడివై
రాణించావు
మీ పాటలతో..అద్భుతాలు సృష్టించావు
ప్రతి ఇంటా ఓ కుటుంబసభ్యుడివయ్యావు
పాటలతో మాటలతో అందరినీ అలరించావు
అందరిలో దేశభక్తిని, దైవభక్తిని నింపావు
పాడుతా తీయగా..అంటూ యువతకు
పాటల పాఠాలు నేర్పావు
స్నేహానికి మరణం లేదని చాటావు
బాలు గారూ!..మీ గానం..మనోహరం
మీ కీర్తి..అజరామరం
ఆచంద్రతారార్కం...మీ ఖ్యాతి
మిమ్ము ఏనాటికీ మరువదు..ఈ భరతజాతి!
అశ్రునయనాలతో....

**జివిఎస్‌పి వరప్రసాద్‌రావు**
నెల్లూరు.

## స్ఫూర్తిదాయకం కావలి రెడ్‌క్రాస్

కావలి రెడ్‌క్రాస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మెన్ డాక్టర్ ఏ.శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 5న విజయవాడలో జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కావలి శాఖవారు ఈ లాక్ డౌన్ సమయంలో ప్రజలకు ఆహారం పంపిణీ, రోగుల కోసం రక్తసేకరణ తదితర సేవా కార్యక్రమాల్లో ముందుం డడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధి రవిప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్ నాయుడులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకె ఫరీదా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## మా భూములు మాకివ్వండి

**- తమ్మినపట్నం గ్రామ రైతులు**



తమ్మినపట్నం రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

గతంలో పరిశ్రమల ఏర్పాటుకంటూ ప్రభుత్వం తమ నుండి భూములు తీసుకుందని, కానీ ఎలాంటి పరిశ్రమలూ ఏర్పాటు కాలేదని, తిరిగి మా భూములు మాకు ఇప్పించండంటూ చిల్లకూరు మండలం, తమ్మినపట్నం గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఈ నెల 5న గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వర ప్రసాదరావుకు విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత శాఖామంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు.

## కరోనా బాధితులకు పౌష్టికాహారం




ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరు కోవిడ్ సెంటర్ నందుగల కరోనా బాధితులకు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి దాతృత్వంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసిలి ప్రవీణ్, మనుబోలు హరీష్‌రెడ్డి, మణి, విజయ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు నిత్యావసర వస్తువులు



ఈ నెల 5వ తేదీ గూడూరు త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో "రెడ్ సంస్థ" ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 35 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వై.స్నేహలతారెడ్డి దాతగా వ్యవహరించి 5000 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డా. పి.కమలసాయి, మహిళామండలి సెక్రటరీ విష్ణువందన, "రెడ్ సంస్థ" ప్రెసిడెంట్ జానా సుధీర్, సెక్రటరీ కోడిపర్తి శ్రీధర్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



ఈ నెల 3న గూడూరులోని కేశవ నిలయంలో జరిగిన వి.హెచ్.పి గూడూరు కార్యదర్శి విళ్ళారి మధు సంస్మరణ సభలో పాల్గొని నివాళులర్పిస్తున్న విహెచ్‌పి గూడూరు అధ్యక్షకార్యదర్శులు మురళిరెడ్డి, సి.హెచ్.రమణయ్య తదితరులు

## సచివాలయ వ్యవస్థ పనితీరు బాగుంది

**- సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ పనితీరు ఎంతో బాగుందని గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. గూడూరులోని మాలవ్యానగర్‌లో ఉన్న 18, 20వ సచివాలయాలను ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం అక్కడినుంచి నరసింగరావుపేటకు చేరుకుని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి పనితీరు బాగుందన్నారు. ఆయన వెంట గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి, రెవెన్యూసిబ్బంది వున్నారు.

## రూరల్ సి.ఐగా శ్రీనివాస్‌రెడ్డి



గతంలో గూడూరు రూరల్ సి.ఐగా పని చేసి విధి నిర్వహణలో మంచిపేరు సంపాదిం చుకున్న శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన మళ్ళీ గూడూరు రూరల్ సి.ఐగా బాధ్యతలు స్వీకరించాడు. ఈయన గత సార్వత్రిక ఎన్నికలకు ముందు గత ప్రభుత్వంలో రూరల్ సి.ఐగా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై నెల్లూరురూరల్ సి.ఐగా వెళ్లాడు. తిరిగి ఈ ప్రభుత్వ హయాంలో ఆయన గూడూరు రూరల్ సి.ఐగా వచ్చాడు. ఆయనకు ముందు ఇక్కడ పనిచేసిన రామకృష్ణారెడ్డి ప్రజలతో సంబంధాలు కొనసాగించి మంచిపేరు సంపాదించుకున్నాడు. గూడూరురూరల్ సర్కిల్ పరిధిలో గూడూరు రూరల్ స్టేషన్‌తో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన సమయంలో శ్రీనివాస్‌రెడ్డి మంచి అధికారిగా అందరితో సత్సంబంధాలు కొనసాగించాడు. ఆయన తిరిగి గూడూరురూరల్‌కు సి.ఐగా రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మంచి మనసున్న నాయకుడు

**బల్లి దుర్గాప్రసాద్‌రావుకు ముస్లిం మైనారిటీల కన్నీటి నివాళి**



గూడూరు షాదీ మంజిల్‌లో ఇటీవల గూడూరు పట్టణ ముస్లిం సోదరులు తిరుపతి పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ బల్లి దుర్గాప్రసాద్‌రావును స్మరించుకుంటూ కన్నీటి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తనకు బల్లి దుర్గాప్రసాద్‌తో 30 సంవత్సరాల అనుబంధం ఉం దని, ముఖ్యంగా ఎప్పుడు ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించే గొప్ప నాయకుడాయన అని అన్నాడు. గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్ నిర్మాణంలో బల్లి దుర్గాప్రసాద్ రావు పాత్ర మరువలేనిదని అన్నాడు. సిపిఐ నాయకులు కాలేష మాట్లాడుతూ బల్లి దుర్గాప్రసాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా అనేక పదవుల్లో ఉండి పేద ప్రజలకు నిస్వార్థ సేవ చేశారని కొనియాడారు. దర్గా ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్, మహమ్మదియన్ వెల్ఫేర్ నెట్వర్క్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీం, ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ మగ్దుమ్ మొహిద్దీన్, మొహమ్మద్ అన్వర్, ఇలియాజ్ అహ్మద్, మగ్దుమ్, షానవాజ్, బాబు, జమీర్, ఉమర్, గౌస్ బాషా, సందాని బాషా, కరీముల్లా, గోల్డ్ నాజర్, జాకీర్, యస్దాని, కబీర్, అర్షద్, ముస్లిం యువత పాల్గొన్నారు.

### కళాంజలి అనంత్ నిర్మించిన..

# 'పండుటాకులు'కు రాష్ట్రస్థాయి బహుమతి



'పండుటాకులు' లఘు చిత్రంలో ఓ సన్నివేశం



నటీనటులకు సన్నివేశాలను వివరిస్తున్న దర్శకుడు 'కళాంజలి' అనంత్

లఘు చిత్రాల నిర్మాణంలోనూ నెల్లూరీయులు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటున్నారు. ఇటీవలే నెల్లూరీయుడు, కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకునిగా అందరికీ సుపరిచితమైన కళాంజలి అనంత్ నేతృత్వంలో నిర్మించిన లఘుచిత్రం 'పండుటాకులు'కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బహుమతి లభించింది. 'వృద్ధాప్యం' అనే అంశంపై ఈ లఘుచిత్రం నిర్మించారు. వృద్ధాప్యం పైబడినప్పటికీ వారిలో తొణికిసలాడే ఆత్మీయ బంధాలు అనుబంధాలను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరిస్తూ, మన కోసం ఎన్నో త్యాగాలు చేసిన, మనల్ని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదని, వృద్ధాప్యంలో వారిని మనం దూరం చేసుకోకూడదనే ఇతివృత్తంతో 'లౌల్లీ క్రియేషన్స్' ఆధ్వర్యంలో ఈ లఘు చిత్రం నిర్మితమైంది. కళాంజలి అనంత్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. ప్రఖ్యాత కవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జాషువా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు రామరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో 'తెలుగు వైతాళికుల స్ఫూర్తి సంబరాలు' సెప్టెంబర్‌లో నిర్వహించారు. తెలుగు షార్ట్ ఫిల్మ్స్ అసోసియేషన్, గుర్రం జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు మొత్తం 270 షార్ట్ ఫిల్మ్‌లు పోటీకి వచ్చాయని, అందులో అయిదు లఘుచిత్రాలకు బహుమతులు రాగా, 'పండుటాకులు' చిత్రానికి నాల్గవ బహుమతి వచ్చిందని కళాంజలి అనంత్ చెప్పారు. పాలపర్తి శివకుమార్-స్రవంతిలు నిర్మాతలుగా, ధనుంజయ, బెనర్జీ, మునిచంద్ర, పార్వతీశం, లహరి, రామచంద్రరావు, యం.ప్రసన్నాంజనేయులు, డాక్టర్ చక్కా చెన్నకేశవ, డాక్టర్ శ్రీనివాసతేజ, అనూష నటీనటులుగా ఈ చిత్రానికి మంచి పేరు తెచ్చారని, చైతన్యకుమార్, సంగీత్ సౌరభ్‌ల సంగీతం అందరినీ ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సహకరించిన వారందరికీ అనంత్ తన కృతజ్ఞతలు తెలిపారు.

### కామాక్షమ్మ అమ్మవారికి..

## వజ్రాలు పొదిగిన బంగారు ముక్కుపుడక

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి ఈనెల 5న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు గ్రామానికి చెందిన చింతలపల్లి సుస్మిత అనే భక్తురాలు 8గ్రాముల 30మిల్లీగ్రాముల బరువున్న ముక్కుపుడకను అమ్మవారికి సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా దాత సుస్మితకు ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, కార్యనిర్వహణాధికారి ఎ.వెంకట శ్రీనివాసులురెడ్డి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పూజలు చేయించి ప్రసాదాలు, కుంకుమ, శేషవస్త్రాలు అందజేశారు.

# మహానేత వై.యస్‌ను విస్మరించారు



దగదర్తి మండలం పెద పుత్తేడు శ్రీరామపురం పంచాయితీలో వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర సందర్భంగా ఆయన స్వహస్తాలతో ఆవిష్కరించిన మహానేత డా. వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నిరాదరణకు గురౌతోంది. ఈ విగ్రహ ఆవిష్కరణకు గొట్లపాళెం గ్రామానికి చెందిన వైయస్ అభిమాని చెర్లో కోటారెడ్డి అంతా తానై భరించి విగ్రహం చుట్టూ ప్రహరీగోడను కూడా నిర్మించాడు. అయితే చెర్లో కోటారెడ్డి మరణానంతరం వైయస్ విగ్రహం ఆలనాపాలన చూసే నాథుడు కరువయ్యాడు. దీంతో విగ్రహ పరిసర ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వైసిపి నేతలు దీనిని పట్టించుకోకపోవడంతో వైయస్ అభిమానుల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా నేతలు, అధికారులు స్పందించి వైయస్ విగ్రహ పరిసరాలను శుభ్రపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### 17 నుంచి చెంగాళమ్మ అమ్మవారి ఆలయంలో..

## శరన్నవరాత్రి వేడుకలు

**కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఏర్పాట్లు**

సూళ్ళూరుపేట శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 17 నుంచి కోవిడ్ వైరస్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా చేసేందుకు ఆలయ నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం ఈనెల 5న ఆలయ ధర్మకర్తల మండలి సమావేశమైంది. ఈనెల 17 నుంచి 25వ తేది వరకు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి. కోవిడ్ వైరస్ నేపథ్యంలో మహిషాసురమర్ధిని గ్రామోత్సవాన్ని,అమ్మవారికి సామూహికంగా సారెలు సమర్పించే కార్యక్రమాన్ని రద్దుచేశారు. భక్తులు వ్యక్తిగతంగా అమ్మవారికి సారెలు సమర్పించుకోవచ్చని నిర్ణయించారు. నవరాత్రుల్లో తిథుల ప్రకారం 24వతేది ఉదయం దుర్గాదేవి అలంకారం, సాయంత్రం శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం ఉంటుందని, నిత్యాన్నదాన పథకాన్ని ఈనెల 17 నుంచి పునఃప్రారంభిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మహాభారత ఘట్టాలను కళ్ళ ముందు నిలిపే...

# శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానం



**మన దేవాలయాలు** (15)

**నెల్లూరు, మూలాపేటలో వెలసివున్న శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయం ఎంతోకాలం నుంచి భక్తులకు కొంగుబంగారంగా అలరారుతోంది. ఈ ఆలయంలో కొలువైవున్న ద్రౌపది దేవి అమ్మవారికి అనాదిగా విశిష్టమైన పూజలు జరుగుతున్నాయి. ఈ ఆలయం వివాహాలకు కూడా ప్రసిద్ధి. ఇక్కడ పెళ్లి చేసుకుంటే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం.**

నెల్లూరులోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానానికి ఎంతో ప్రాచీనమైన చరిత్ర ఉంది. ప్రత్యేకించి అగ్నికులజులకు ఇది ఆరాధ్యమైన దేవాలయం. ఈ ఆలయ నిర్మాణం ఎప్పటిదనే స్పష్టమైన ఆధారాలు లేవు. కానీ అందుకు సంబంధించి పలు పురాణ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఏదేమైనా మహాభారత ఘట్టాలను గుర్తు చేసే విధంగా నేటికీ ఇక్కడ ఎంతోకాలంగా ప్రతి మూడేళ్ళకు ఒకసారి పెద్దఎత్తున బ్రహ్మోత్సవాలు జరుగుతుండడం విశేషం.

#### అగ్నికులజుల ఆరాధ్యదేవత..

#### ద్రౌపదీదేవి అమ్మవారు :

పూర్వకాలంలో హిమాలయాల్లో జంబు మహర్షి గొప్ప యాగం నిర్వహించాడని, ఆ యాగకుండంలోని అగ్ని నుంచి తేజోవంతుడైన పురుషుడు ఆయుధాలు ధరించి ఉద్భవించాడని, ఆయనే అగ్నికుల క్షత్రియుడైన స్వయంభువు మనువు అని, ఆయన సంతతి వారే అగ్నికుల క్షత్రియులని, వారినే పల్లవులు అని కూడా పిలుస్తారని ఓ కథనం ఉంది. అదేవిధంగా ఆ అగ్ని గుండం నుంచి లోకకల్యాణార్ధం ద్రౌపదీదేవి అమ్మవారు జన్మించారని, పాండవులకు ధర్మపత్నిగా, శ్రీకృష్ణునికి సోదరిగా అమ్మవారు పురాణప్రసిద్ధి చెందారని, అందువల్ల ద్రౌపదీదేవి అమ్మవారు అగ్నికులజులకు కులదేవతగా ఇక్కడ పూజలందుకుంటోందని పెద్దల మాట. అందుకు తగ్గట్టుగా ఈ ఆలయంలో ప్రధాన దేవతామూర్తులు ద్రౌపదిదేవి, పార్ధసారధి (శ్రీకృష్ణుడు), యుధిష్టరుడు(ధర్మరాజస్వామి) వీరు ముగ్గురు మూలవర్లుగా పూజలందుకుంటున్నారు. ప్రధానంగా ద్రౌపదీదేవి అమ్మవారికి ఇక్కడ విశేష పూజలు జరుగుతుంటాయి.

#### ద్రవిడ సంప్రదాయంలో పూజలు

అనాదిగా ఈ ఆలయంలో శాక్తికేయ, ద్రవిడ సంప్రదాయంలో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి ద్రౌపదిదేవి అమ్మవారు ఎంతో మహిమాన్వితమైన దేవతగా, ఆరోగ్య ప్రదాతగా, సంతానప్రదాయినిగా ప్రసిద్ధి. ఈ ఆలయంలో ఉత్సవమూర్తులుగా ఉన్న పంచపాండవుల విగ్రహాలు, పోతురాజు విగ్రహం దారు శిల్పాలు(కొయ్యతో చేసినవి)గా ఇక్కడ దర్శనమిస్తాయి. వీరికి దక్షిణం వైపు మూల పురుషుడు పరీక్షిత్తు, ఉత్తర దిక్కున వ్యాసభగవానుని శిలావిగ్రహాలు కూడా ఉన్నాయి. నైరుతిలో నాగులపుట్ట ఉంది. ఇంకా ఈ ఆలయంలో చెన్నకేశవస్వామి, నాగ మానసాదేవి మందిరాలు కూడా ఉన్నాయి. ఈ ఆలయానికి ఈశాన్యదిక్కులో ఉన్న బావికి పుణ్యతీర్థమని పేరు. నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న తల్పగిరి రంగనాథస్వామి ఆలయం చెంతనే ఉన్న పవిత్రమైన పెన్నానది నుంచి ఈ బావిలోకి సొరంగమార్గం ద్వారా పెన్నా జలాలు వచ్చేవని, ఈ జలాలతోనే ఆలయంలోని మూలవర్లకు అభిషేకం చేస్తారని, ఈ పవిత్ర జలాలను భక్తులు సర్వరోగ నివారిణిగా భావించి స్వీకరిస్తుంటారని పెద్దలు చెప్తున్నారు. ఆలయం ప్రాంగణంలోని ఒక పెద్ద మర్రిచెట్టు భక్తులను సేదతీరుస్తుంటుంది.

#### మహాభారతాన్ని కళ్ళముందు నిలిపే బ్రహ్మోత్సవాలు :

నెల్లూరు ధర్మరాజస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలంటే మహాభారతాన్ని కళ్ళముందు చూసినట్లే. అందులోనూ మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మహనీయుడు..కవిబ్రహ్మ తిక్కన నెల్లూరీయుడే కావడం విశేషం. భారతంలో పాండవ జననం నుంచి ధర్మరాజ పట్టాభిషేకం వరకు అన్ని ఘట్టాలను తలపిస్తూ బ్రహ్మోత్సవాలు అగ్నికుల క్షత్రియ సంప్రదాయంలో ఎంతో వైభవంగా జరుగుతుంటాయి. అంకురార్పణతో మొదలై సప్పర ఉత్సవం, పాండవ జననం, అక్షరాభ్యాసం, లక్క గృహ దహనం, హిడింబాసుర వధ, ద్రౌపదిదేవి అమ్మవారి కల్యాణం, రాజసూయ యాగం, సుభద్రా కల్యాణం, ద్రౌపదీ మానసంరక్షణ, తపస్సుమాను, విరాటపర్వం, మల్లయుద్ధం, కీచక వధ, ఉత్తర గోగ్రహణం, శ్రీకృష్ణ రాయబారం, అలుగు నిలుపు, కాళిపూజ, ఇలావంతుని వధ, దుర్యోధన-దుశ్శాసన వధ, అగ్నిగుండ ప్రవేశం, వసంతోత్సం, యుధిష్టర పట్టాభిషేకం వగైరాలు ఉత్సవాలుగా అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. ఈ ఉత్సవాలకు నిత్యం వేలసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ ఉత్సవాలను తిలకించిన భక్తుల కోరికలు తప్పనిసరిగా నెరవేరుతాయని, ద్రౌపదిదేవి అమ్మవారి అనుగ్రహంతో భక్తుల కష్టాలు తొలగిపోయి, శుభప్రదమైన జీవితాలు చేకూరుతాయని ప్రతీతి. ముఖ్యంగా అయిదవరోజు, పదవరోజు ఉపవాస దీక్షలతో పెద్దసంఖ్యలో భక్తులు ద్రౌపదిదేవి అమ్మవారిని కొలుస్తుంటారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఎంతో విశేషమైనవి తపస్సుమాను, ఉత్తర గోగ్రహణం, అగ్నిగుండ ప్రవేశం.

21 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలతో పాటు ప్రతిఏటా నవరాత్రులు, కార్తీకదీపోత్సవాలు, శ్రీకృష్ణ జన్మోత్సవం తదితర విశిష్టమైన కార్యక్రమాలను ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఆలయానికి జిల్లాలోని వారే కాక, రాష్ట్రవ్యాప్తంగా కూడా భక్తులు తరలివస్తుంటారు.

# కమలంతో కలవడం కలే..!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రయోజనాలు, రాష్ట్రానికి రావలసిన నిధులు, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్న కొన్ని రాజ్యాంగ వ్యవస్థలు తదితర అంశాలపై చర్చించడానికే ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో కేంద్రమంత్రి అమిత్‌షాని, మొన్న మంగళవారం ప్రధానమంత్రి మోడీని కలిశాడన్న విషయం... విషయ పరిజ్ఞానం ఉన్న సామాన్యుడికి సైతం అర్థమవుతుంది.

జగన్ కమలంతో దోస్తీ చేయడానికే ఢిల్లీకి వెళ్లాడని, మూడు కేంద్రమంత్రి పదవులు తీసుకుని కమలం పార్టీకి బయట నుండి మద్దతు పలకడానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నాడని కొందరు అజ్ఞానులు విష ప్రచారానికి తెర లేపి పుకార్లను షికార్లు చేయించారు.

2009 లో కేంద్రంలో అత్యంత శక్తివంతంగా అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ బెదిరింపులకే జగన్ లొంగలేదు, ఏ అధికారం లేకుండానే రాజశేఖరరెడ్డి కొడుకుగా ప్రజలలోకి వెళ్లి ఓదార్పు యాత్రను చేపట్టాడు, 2014లో ప్రజలు తనకు పట్టం కట్టకపోయినా ఎక్కడా నిరాశ చెందకుండా ఒంటరిగానే తన పోరాటాన్ని కొనసాగించాడు, తన పార్టీలో గెలిచిన శాసన సభ్యులను పచ్చ పార్టీ గొర్రెలను కొన్నట్లు కొంటుంటే ఏ రోజూ వాళ్ళని ఆపే ప్రయత్నం చెయ్యలేదు. తనవాళ్ళే తనతో వుంటారనే ఒకే ఒక ఆత్మవిశ్వాసంతో తన ప్రయాణాన్ని కొనసాగించాడు. 2014లో కేంద్రంలో అతి పెద్ద పార్టీగా భారతీయ జనతాపార్టీ అవతరించి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా జగన్ ఎక్కడా తొణకలేదు, తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించడమే ధ్యేయంగా పాదయాత్రను చేపట్టి తండ్రిని మించిన కొడుకుగా ప్రజాదరణ పొంది 175 సీట్లకు గాను 151సీట్లు సాధించి 2019లో అధికారంలోకి వచ్చాడు.

ఇప్పుడు ఆయనకు భారతీయ జనతా పార్టీ కొమ్ము కాయాల్సిన అవసరమే లేదు. తనకంటూ ఒక బలమైన ఓటు బ్యాంకును తయారుచేసుకుంటూ ముందుకెళ్తున్నాడు, ఆంధ్రప్రదేశ్‌ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని సాక్షాత్తు ప్రధానమంత్రే కితాబు ఇచ్చే స్థాయిలో తన పరిపాలన కొనసాగిస్తున్నాడు, ఇలాంటి తరుణంలో జగన్ పార్టీని అప్రతిష్ట పాలుచేసే మైండ్‌గేమ్‌ని పచ్చ పార్టీ మొదలుపెట్టింది, సిద్ధాంతపరంగా ఆలోచిస్తే బీజేపీ వైసీపీతో కలిసినా వైసీపీ బీజేపీతో కలిసినా ఇద్దరికీ నష్టమే. తనకంటూ ఒక బలమైన పునాదిని ఏర్పాటు చేసుకుంటూ పరిపాలన సాగిస్తున్న జగన్ ఇప్పుడు బీజేపీకి మద్దతు తెలపడమంటే రాజకీయంగా తనను తాను తగ్గించుకున్నట్లే అవుతుంది. ఇదే తరుణంలో బీజేపీ జగన్తో దోస్తీచేస్తే తమ పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చినట్లే అవుతుంది. ఇదే అదనుగా తీసుకుని తాము లాభపడదామని ఆలోచన చేస్తున్న పచ్చ పార్టీ చేసిన, చేస్తున్న దుష్ప్రచారమే ఈ దోస్తీ వార్తలు.

ఇప్పుడే కాదు ఎప్పటికీ బీజేపీ వైసీపీ కలిసే ప్రసక్తే ఉండదు, సిద్ధాంతపరంగా ఈ రెండుపార్టీల ఆలోచనలు తూర్పు పడమరలే. అలాంటిది వీరు కలుస్తారనుకోవడం అవివేకమే అవుతుంది. అలా అని ఎవరైనా అనుకుంటే అది రాజకీయ అజ్ఞానమే అవుతుంది.

# మరో చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)



మరో అత్యంత అధునాతన ఆయుధం భారత అమ్ములపొదిలోకి వచ్చి చేరినట్లయింది. డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు తమ సత్తా చాటుతూ రూపొందించిన ఈ సూపర్ సోనిక్ క్షిపణి సహకారంతో ప్రయోగించే టార్ఫెడో వ్యవస్థ(స్మార్ట్) ప్రయోగం విజయవంతం కావడం మన సింహపురీయులకే కాదు.. భారతీయులందరికీ గర్వకారణం.

యుద్ధతంత్రంలో ఎంతో కీలకమైనది జలాంతర్గాముల వ్యవస్థ. సముద్రజలాల్లో అట్టడుగున పొంచి ఉండే శత్రు జలాంతర్గాముల గుట్టుమట్లు కనిపెట్టి వాటి పనిపట్టేందుకు డిఆర్‌డిఓ తాజాగా రూపొందించిన టార్ఫెడో వ్యవస్థను ఈనెల 5వ తేది ఉదయం 11.45 గంటలకు ఒడిశా తీరంలోని ఎపిజె అబ్దుల్‌కలాం ఐలాండ్ నుంచి విజయవంతంగా పరీక్షించడం జరిగింది. శత్రు దేశాల జలాంతర్గాములను కనిపెట్టి మెరుపు వేగంతో ధ్వంసం చేసే అత్యంతాధునిక ఈ టార్ఫెడో ప్రయోగం విజయవంతం కావడం విశేషం. దేశీయంగానే అభివృద్ధి చేసిన ఈ సూపర్‌సానిక్ మిస్సైల్ అసిస్టెడ్ రిలీజ్ ఆఫ్ టార్ఫెడో(స్మార్ట్) వ్యవస్థ విజయవంతం కావడం పట్ల భారత రక్షణశాఖ అభినందిస్తూ, స్మార్ట్‌తో భారత నావికాదళం సామర్థ్యం మరింత పెరిగిందని ప్రశంసించింది. అత్యంత ప్రాధాన్యతగల ఈ పరీక్షను నిర్వహించడంలో విజయం సాధించిన డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలను భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు కూడా.

## భారత్ మరో ముందడుగు

ప్రపంచంలో ఇప్పటిదాకా దాదాపు సుమారు 50 కిలోమీటర్ల రాకెట్‌కు అనుసంధానించిన టార్ఫెడోలు ప్రయాణించేది 150 కిలోమీటర్ల దూరం దాకా వెళ్తాయి. అయితే స్మార్ట్ విధానంలో టార్ఫెడో 600 కిలోమీటర్లకు పైగానే దూసుకువెళ్తుంది. ఈ క్షిపణులు మోసుకెళ్లే టార్ఫెడో వ్యవస్థలు అమెరికా, రష్యా, చైనా వద్ద ఉన్నాయి. తాజాగా డిఆర్‌డిఓ సంస్థ ఆధ్వర్యంలో, డిఆర్‌డిఓ ఛైర్మెన్ మన నెల్లూరీయుడైన గుండ్రా సతీష్‌రెడ్డి సారథ్యంలో సూపర్‌సోనిక్ క్షిపణితో టార్ఫెడో ప్రయోగం విజయవంతం కావడంతో యుద్ధతంత్రంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో మనదేశం మరో ముందడుగు వేసినట్లయింది. జలాంతర్గామి విధ్వంసక యుద్ధతంత్రంలో భారత్ మరో మైలురాయిని చేరుకున్నట్లయింది.

## ఇదెంతో శక్తిమంతమైన వ్యవస్థ - డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి

సూపర్‌సోనిక్ క్షిపణులు, టార్ఫెడోలు ఈ రెండు వ్యవస్థలను అనుసంధానం చేసి టార్ఫెడోను రూపొందించడం జరిగింది. ఈ వ్యవస్థలో ఒక క్షిపణి తక్కువ బరువుండే టార్ఫెడోను మోసుకువెళ్తుంది. ఇది లక్ష్యానికి చేరువలోకి వచ్చేదాకా గాలిలో అతితక్కువ ఎత్తులో దూసుకువెళ్ళి జలాంతర్గామి దగ్గరకు చేరుకోగానే..టార్ఫెడోను నీళ్ళలోకి వదులుతారు. అంతే.. క్షణాల వ్యవధిలోనే ఆ శత్రు జలాంతర్గామిని ఈ టార్ఫెడో ధ్వంసం చేస్తుంది. టార్ఫెడో రేంజ్ కంటే ఎక్కువ దూరంలో ఉండే లక్ష్యాలను ఛేదించేందుకు ఈ అధునాతన స్మార్ట్ ఆయుధాన్ని డిఆర్‌డిఓ రూపొందించడం విశేషం. ఇదెంతో అత్యంత శక్తిమంతమైన వ్యవస్థ అని, స్మార్ట్ సాంకేతిక పరిజ్ఞానం గేమ్ ఛేంజర్ అవుతుందని, యాంటీ సబ్‌మెరైన్ యుద్ధతంత్రంలో ఇదొక కీలకమలుపు అని డిఆర్‌డిఓ ఛైర్మెన్ మన సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు.

సాగరజలాల్లో ఎంతో గుట్టుగా సంచరించే శత్రు జలాంతర్గాముల పనిపట్టేందుకు ఈ అస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, జలాంతర్గామి విధ్వంసక యుద్ధరీతిలో ఈ స్మార్ట్ ఒక విప్లవాత్మక అస్త్రమని కూడా ఆయన పేర్కొన్నారు.

## నా తల్లి, తండ్రీ, గురువు, దైవం...

# అన్నీ బాలు గారే!...

***గా**నగంధర్వుడు, భారతీయ సినిమా గాయకుడు, విశ్వవిఖ్యాత సంగీతజ్ఞుడు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారితో నా ప్రయాణం చాలా సుదీర్ఘమైనది. దాదాపు 35 సంవత్సరాల సుదీర్ఘమైనటువంటి అత్మీయతానుబంధం మా ఇద్దరికీ ఉంది. సినీ పాటల తోటలో ఈ చిన్ని మొక్కను నాటారు, నీళ్ళుపోశారు, పెంచారు, అక్కున చేర్చుకున్నారు, ఆదరించారు. అందుకే ఆయన నా తల్లి, తండ్రి, గురువు, దైవం. ఒక్క మాటలో చెప్పాలంటే నన్ను పాటల ప్రపంచంలోకి చెయ్యి పట్టుకుని నడిపించిన మహానుభావుడు బాలు గారే. ఆయనతో సాహచర్యం..అనుబంధం నా పూర్వజన్మ సుకృతం!*



అన్నయ్య-నేను - వెన్నెలకంటి (సినీ కవి)

ఇంత త్వరగా అన్నయ్య బాలు గారి గురించి మాట్లాడవలసి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. సినిమా రంగానికి రాకముందు నుంచే కాదు.. నా చిన్నతనం నుంచి కూడా బాలు గారంటే నాకెంతో అభిమానం. ఘంటసాల గారన్నా అభిమానమే. అయితే 'ఏకవీర'లో వీరిద్దరూ కలిసి పాడుతున్నప్పుడు ఘంటసాల గారి లాగా పాడకుండా తన గొంతులో ఉన్నటువంటి ప్రత్యేకతను నిలుపుకుంటూ బాలు గారు పాడటం నాకెందుకో బాగా నచ్చింది. అప్పటినుంచి బాలు గారి అభిమానినయ్యా. నెల్లూరులో కామేశ్వర రావు(కామయ్య)గారు, ఎన్.వి.ఎస్. ప్రసాద్ తదితరులంతా కలిసి విజేత ఆర్ట్స్ తరఫున నాటకాలాడేవారు. కామేశ్వరరావు బాలు గారికి మిత్రుడు కూడా. నాకు చిన్నతనం నుంచి పాటలు రాయడం ఇష్టం కనుక నేను పాటలు రాస్తుంటే నా మిత్రుడు గిరీశం చాలా బాగా బాణీలు కట్టేవాడు. అలా ఎన్నో పాటలు రాస్తుండేవాడిని. ఆ తరువాత ఎక్కడో అనుకోకుండా డా. ప్రభాకర్‌రెడ్డి గారిని కలవడం జరిగితే... ఆయన నా కవిత్వం, పాటలు చూసి ఆయన తీస్తున్న 'శ్రీరామ చంద్రుడు' అనే సినిమాలో 1986, సెప్టెంబరు 16వ తారీఖున ఒక పాటకు అవకాశం ఇచ్చి నాచేత రాయించి రికార్డ్ చేశారు.. ఆ పాటను సుశీలగారు, చిత్రగారు పాడారు. ఆ క్యాసెట్టు తీసుకుని నెల్లూరులో మిత్రులకు వినిపిస్తే, కామేశ్వరరావు గారు కూడా ఆ క్యాసెట్టు విని, బాలుగారికి మీరు అభిమాని కదా, తీసుకెళ్ళి వినిపిద్దాం అంటూ బాలు గారి వద్దకు మమ్మల్ని తీసుకువెళ్ళాడు. ఆ క్యాసెట్టుని, నేను పుస్తకంలో రాసుకున్న పాటల్ని ఆయన విన్నారు. చాలా సంతోషపడ్డారు. చాలా మంచి పాటలండి అని అభినందించారు.

## నేను రాసిన పాటలు బాలు గారు పాడడం.. నా అదృష్టం

ఆ తర్వాత, 1987 జనవరిలో బాలు గారు నన్ను పిలిపించారు. రోజుకు దాదాపు ఏడెనిమిది రికార్డింగులు చేసే పరిస్థితిలో వున్న ఆయన నన్ను తీసుకువెళ్ళిన ప్రతిచోటా ప్రతి మ్యూజిక్ డైరెక్టర్‌కి నేనొక కుర్రాడి గురించి చెప్పాను కదా, నెల్లూరు స్టేట్‌బ్యాంక్‌లో పనిచేసేవారు..అని చెబుతున్నారంటే, ఎంతమందికి ఎన్ని రోజుల నుండి నా గురించి చెప్తున్నారో కదా అని విస్తుపోయాను. చివరకు సంగీత దర్శకుడు చక్రవర్తి గారి దగ్గరకు తీసుకువెళ్ళి పరిచయం చేశారు. ఆయన ఒక పాటకు అవకాశం ఇచ్చారు. చక్రవర్తి గారు ట్యూన్ ఇవ్వగానే పది నిమిషాల్లోనే పాట రాశాను. అది తెలుసుకున్నప్పుడు బాలు గారి కళ్ళల్లో కనిపించిన ఆనందం..పాట ఓకే అయ్యిందని అన్నప్పుడు ఆయన కళ్ళల్లో మెరిసిన సంతోషం ఎన్నిసార్లు తలచుకున్నా నా జీవితంలో నేనాటికీ మర్చిపోలేనటువంటి ఒక అనుభూతి.

## పాటల తోటలోకి... నన్ను చెయ్యిపట్టుకుని నడిపించారు...

ఒక అన్నయ్యలా బాలు గారు..నా చెయ్యి పట్టుకుని నన్ను పాటల తోటలోకి నడిపించారు. ఈ చిన్ని మొక్కను నాటారు, నీళ్ళు పోశారు, పెంచారు, అక్కున చేర్చుకున్నారు, ఆదరించారు. అందుకే ఆయన నా తల్లి, తండ్రి, గురువు, దైవం.. అంతకంటే ఎక్కువైన మాట వున్నా కూడా అది ఆయనకు వర్తిస్తుంది. నోరారా తమ్ముడు అని పిలిచే అన్నయ్య ఇప్పుడు లేరనుకోవడం ఎంతో బాధగా ఉంది. నా బాధ ఏమని చెప్పను?..ఎంతని చెప్పను?.. 35 ఏళ్ళ పాటల ప్రయాణంలో నేను దాదాపు స్ట్రెయిట్, డబ్బింగ్ కలిపి మూడు వేల దాకా పాటలు రాసుంటాను. వాటిలో సింహభాగం అన్నయ్య బాలు గారే పాడారు. ఇంతకన్నా అదృష్టం ఏమి కావాలి?.. ఆయన సంగీత దర్శకత్వంలో ఆయనకు..నాకు ఇష్టమైన మంచి పాట 'తెల్లమబ్బు తేరు మీద' అనే పాటను నాతో రాయించారు. అలాఆయన ప్రతి అడుగులో నన్ను తనవెంట తీసుకువెళ్ళారు. నన్ను ఒక సొంత మనిషిగా, ఇంటి మనిషిగా, మిత్రుడిగా, శిష్యుడుగా, తమ్ముడిగా చూసిన మహానుభావుడు బాలు గారు. ఎన్ని భాషల్లో పాడినా, 'నా మాతృభాష సంగీతం' అని చెప్పుకోగలిగిన గొప్ప విశాలహృదయులు, మహా గొప్ప సంగీతజ్ఞులు శ్రీ బాలు గారు. ఆయన ఆశీస్సులు నాకు లభించడం ఏ జన్మ పుణ్యమో!...

ఏదేమైనా.. నాకు అన్నివిధాలా చేయూతనిచ్చి నన్ను ప్రోత్సహించిన అన్నయ్య బాలు గారు లేకపోవడం ఇప్పటికీ నేను జీర్ణించుకోలేని విషయం. 'జయంతి జయ సుకృతి జయ రససిద్ధ కవీశ్వరా.. నాస్తికేశ మిసకాయే జరామరణజం భయం' అన్నారు పెద్దలు. కానీ అప్పట్లో కవులకు మాత్రమే ఇది అన్వయించేటట్లు రాశారు. కానీ నేటి కాలంలో.. కవులు మాత్రమే కాదు.. కళాకారులందరు కూడా రససిద్ధులైన వారే. వారందరూ చిరంజీవులే. బాలుగారి గళం కూడా చిరంజీవి,.. ఆయన ఎప్పటికీ మన మధ్యలో ఉంటారు. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మన గుండెల్లో నిలిచే ఉంటారు. ఆ మహానుభావుడికి.. ఆ మహోన్నత మానవతా మూర్తికి.. హృదయపూర్వకంగా అశ్రునివాళులర్పిస్తున్నా!..

# జగనన్న విద్యా కానుక

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న సుమారు 43లక్షల మంది విద్యార్థిని, విద్యార్థులకు కనీవినీ ఎరుగని విధంగా 650 కోట్ల రూపాయల ఖర్చుతో 'జగనన్న విద్యా కానుక' పథకం ప్రారంభం కావడంతో అటు తల్లిదండ్రుల్లోనూ..ఇటు విద్యార్థిలోకంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ బడుల్లో చదవడం గతంలో కొందరికి చులకనగా ఉండేది కానీ.. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడమన్నది విద్యార్థు లకు ఒక గొప్ప వరంగామారింది. యువనేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో బడిబాట..ఇక బంగారుబాట కాబోతోంది. బతుకు భారంగా.. బడికి దూరంగా ఉన్న బాలలకు ఇక ప్రభుత్వ బడి.. చదువులమ్మ ఒడి కాబోతోంది. యువ ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో పాఠశాలల దశ తిరిగింది. ఎప్పుడూ ఎవరూ ఊహించనంతగా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల స్థాయి.. గౌరవం గణనీయంగా పెరుగుతోంది.

**వారం రోజుల్లోగా విద్యా కిట్‌లు పంపిణీ :**

దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా విద్యార్థి లోకాన్ని ఎంతగానో ఆకట్టుకుంటున్న విద్యా కానుక.. వారి చదువులకు మార్గదర్శకం కాబోతోంది. రాష్ట్రంలోని 42,34,322 మంది విద్యార్థులకు ఈ పథకం కింద లబ్ధి చేకూర్చే విధంగా ఈ పథకం సిద్ధం కావడం పట్ల సర్వత్రా సంతోషం వెల్లువెత్తుతోంది. ఈ పథకానికి ప్రభుత్వం 650 కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులందరికీ అవసరమైన విద్యా కిట్‌లను కూడా సిద్ధం చేసింది. విద్యార్థుల జీవితాల్లో వెలుగుబాటలు పరచే ఈ బృహత్తర పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఈనెల 8న శ్రీకారం చుట్టారు. అందుకు ఇప్పటికే 5.32 కోట్ల పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, 1.27 కోట్ల యూనిఫారాలు, షూలు, సాక్సులు, బెల్టులు, బ్యాగ్‌లతో స్టూడెంట్ కిట్స్ అన్నీ సిద్ధమయ్యాయి. కోవిడ్ నిబంధనలను దృష్టిలో పెట్టుకుని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో వీటిని వారంరోజుల్లోగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం కావడం విశేషం. ఈ విశిష్టమైన పథకాన్ని సిఎం జగన్ ఈనెల 8న కృష్ణాజిల్లాలోని జడ్పీ పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించి లక్షలాదిమంది తల్లిదండ్రుల దీవెన లందుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'నాడు-నేడు', అమ్మ ఒడి, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు బంగారు భవితను చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తాజాగా 1 నుంచి 10వ తరగతి దాకా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక' ద్వారా వారికి మరింత ప్రయోజనం కలిగిస్తోంది.

**బడిపిల్లలకు వెలుగుబాట :**

'జగనన్న విద్యా కానుక' ద్వారా బడిపిల్లలకు వెలుగుబాటలు పడుతున్నాయి. బడులు తెరవక ముందే విద్యార్థులందరికీ ఈ విద్యా కానుక అందజేసి విద్యార్థులు పాఠశాలలకు ఇష్టంగా వెళ్ళేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోంది. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫారాలు, కుట్టు కూలితో సహా ప్రభుత్వమే ఇస్తుంది. అంతేకాదు, స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, వర్క్ బుక్స్, బెల్ట్, సాక్స్, షూస్ అన్నీ ప్రభుత్వమే విద్యార్థులకు కానుకగా అందిస్తుంది. ఇందుకు అవసరమైన సామగ్రి అంతా ఎప్పుడో సిద్ధమైపోయింది కూడా. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, వారికి నాణ్యమైన విద్యను అందించి మెరుగైన ఫలితాలు సాధించాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రుల నుంచి, విద్యావర్గాల నుంచి సంతోషం వెల్లువెత్తుతోంది. నెల్లూరుజిల్లాలోనూ ఈ పథకం ద్వారా జిల్లాలోని మొత్తం 3400 ప్రభుత్వ పాఠశాలల్లోని 2,51,657 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది. కోవిడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రతి విద్యార్థికి 3 మాస్కులు అందజేసి ఈ విద్యాకానుక కిట్‌లను అందజేయనున్నారు. ఏదేమైనా ఈ పథకం గ్రామీణ ప్రజలకు, పేద, మధ్యతరగతి ప్రజలకు ఒక వరం లాంటిది. లక్షలాది మంది పిల్లల చదువులకు చేయూతనిచ్చే ఈ పథకం రావడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

ఈక్షణం

-మంజీర



# స్వరాభినయం

***వెండి తెర మీద శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం సరిగమలు పలికిస్తున్న తరుణంలో ఒక వినూత్న కెరటం ఉవ్వెత్తున ఎగిసింది. తన ఉనికిని చాటుకుంది. ఆ ఉనికి అర్ధశతాబ్దం పాటు మనుగడ సాగించింది. ఆ కెరటం తన సంగీత పరంపరను సమాజానికి అందించింది. శాస్త్రీయ సంగీతానికి జానపద జావళులకు మధ్యేమార్గంగా దూసుకు వచ్చిన ఆ కెరటమే ఎస్పీబీ.***

## ఊరూరా బాలు

ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కెరీర్ మొదలు పెట్టిన కాలం... ఒక సంధి కాలం. అది రేడియో శకం. రంగస్థలానికి ఆదరణ తగ్గుతూ, సినిమాపై మోజు పెరుగుతున్న రోజులు. సామాన్యుల ఇళ్లలో రేడియో ఉన్నా లేకపోయినా గ్రామ పంచాయితీ ఆఫీస్, ఆలయం, భూస్వామి ఇల్లు, ఆ ఊరి స్కూలు టీచరు ఇల్లు... ఇలా కనీసం ఊరికి నాలుగైదు రేడియోలైనా ఉండేవి. 'ఏమయ్యా! ఓ రామయ్యా!!' అని పలుకుతుంది గుడి రేడియో. ' సిరిమల్లె నీవే... విరిజల్లు కావే' అంటుంది ఊరి టీచరు గారిల్లు. 'రవి వర్మకే అందని ఒకే ఒక అందానివో' అనే ఒక ఫ్లాప్ సినిమాకు మిగిలిన ఆల్‌టైమ్ హిట్ సాంగ్ దగ్గర రేడియోను ట్యూన్ చేస్తాడు భూస్వామి కొడుకు. ఇక గ్రామ పంచాయితీ రేడియో 'ఆనాటి ఆ స్నేహం ఆనంద గీతం' అంటూ ఊరివారితో అనుబంధాలను అల్లుకుంటుంది. రేడియో మారుతుంది, ప్రదేశం మారుతుంది. పాట మారుతుంది. అయినా... గొంతు ఒక్కటే. అదే ఎస్పీబీ.

## గొంతుక పలికే నటగీతం

ఇక డెబ్బైల చివరి రోజుల నుంచి ఎనభైల దశకం మొత్తం... ఊరిలో ఏ వేడుక అయినా మైక్ సెట్టింగ్ తప్పనిసరిగా ఉండేది. 'ప్రేమాభిషేకం... ప్రేమకు పట్టాభిషేకం' అంటూ పిల్లకారు గుండెల్లో గుబులు పుట్టించేది మైక్ సెట్. 'దేవీ మౌనమా... శ్రీదేవీ మౌనమా' అని ఎస్పీబీ పాడుతుంటే శ్రోతల మనోఫలకం మీద ఏఎన్నార్ కొంటెగా కనిపించేవాడు. క్రమంగా రేడియోలు విస్తరించాయి. ప్రతి ఇంట్లో ఎస్పీబీ గొంతు తెలుగు వారందరికీ ఇంటి గొంతుక అయింది. అప్పటి పెద్దతరం ఆకాశవాణిలో ఘంటసాల పాటల కోసం ఎదురు చూస్తూ ఉంటే... యువతరం కేవలం బాలు పాటల కోసమే ట్రాన్సిస్టర్లు కొనుక్కున్నది. టీవీ వచ్చే వరకు రాజ్యమేలిన రేడియోశకంలో ఏకఛత్రాధిపత్యం బాలుకే దక్కింది. సినిమాలు అరుదుగా చూసే రోజులవి. అలాంటప్పుడు బాలు తన గొంతులో దృశ్యాన్ని ఆవిష్కరించారు. ఏఎన్నార్ కళ్లలో చిలిపితనం బాలు గొంతులో పలికేది. బాలు గొంతులో పలికిన గమకానికి అనుగుణంగా ఏఎన్నార్ కళ్లతో భావాన్ని పలికించారా? లేకపోతే ఏఎన్నార్ అల్లరిగా తలెగరేయడానికి తగ్గట్లు బాలు గొంతును పలికించేవారా? చెప్పడం కష్టమే. అయితే బాలు గొంతులో నటులందరూ కనిపించేవారు... అంటే నటుల నటనకు ధీటుగా బాలు తన గొంతుకతో అభినయించేవారు. 'ఒరబ్బా వేసుకున్నా కిళ్లీ' అంటూ మాస్ చేత ఈలలు కొట్టించారు. 'ముత్యాలూ వస్తావా... అడిగింది ఇస్తావా' అంటూ అల్లు కామెడీని హైపిచ్‌కి తీసుకెళ్లిన గొంతుక ఎస్పీబీ.

## ఉత్తరాది తోటలో

ప్రేమపావురాలు హిందీ వెర్షన్ 'మైనే ప్యార్ కియా'లో బాలు 'కబూతర్ జా...' అని పాడుతుంటే... కేవలం బాలు కోసమే ప్రతి తెలుగిల్లూ ఆ హిందీ పాటలను సొంతం చేసుకుంది. అప్పటి వరకు మన తెలుగు వాళ్లకు హిందీ పాటలు పరిచయం లేదా అంటే... లేవని కాదు. అయితే కిశోర్‌కుమార్, మహమ్మద్ రఫీ గొంతులో హిందీ పాటలు వింటున్నప్పుడు మనం మనది కాని తోటలో విహరిస్తున్నట్లు ఉండేది. పక్కింటికి వెళ్లి వాళ్ల రేడియోలో వింటున్నట్లు ఉండేది. బాలు గొంతులో బాలీవుడ్ పాట వింటుంటే... ఉత్తరాది నుంచి ఒక అతిథి మన ఇంటికి వచ్చి... మనకోసమే పాటలు పాడి వినిపిస్తున్నట్లు అనిపించేది. మనది కాని భాషను మనవాళ్ల గొంతులో వింటుంటే కలిగే ఆనందం అది.

## తెర మీద పాట

శ్రోతలకు వీనులవిందు చేసిన రేడియో స్థానంలో తొంభైల నాటికి టీవీ కనువిందు చేయడం మొదలైంది. టీవీలు వచ్చిన తర్వాత పుట్టిన పిల్లలు బాలు గాత్రాన్ని ఆస్వాదించలేదనే చెప్పాలి. తెరమీద బొమ్మలు మనిషిని మాయ చేస్తాయి. కనిపించే డాన్సు వెనుక వినిపించే పాట ఒకటుందనే స్పృహను కలగనివ్వవు. పిల్లలు టీవీ చూస్తూ డాన్సు వేయడానికి ఇష్టపడడం కూడా అప్పుడే మొదలైంది. అప్పుడు బాలు స్వయంగా తెరమీదకొచ్చి 'పాడుతా తీయగా' అంటూ ఒక కొత్త శకానికి తెర తీశారు. తెర వెనుకనున్న పాటను తెర మీదకు తెచ్చారు. పాటలోని మాధుర్యం మళ్లీ ప్రాణం పోసుకుంది. పాటకు బాలు పోసిన ప్రాణం దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఇది ఎప్పటికీ కొనసాగుతుంటుంది కూడా.

# ఈ గుంతలు.. పూడేదెప్పుడో!..

**• పరమ అధ్వాన్నంగా నెల్లూరు రోడ్లు**



***నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు సక్రమంగా లేవు. ఎంతో కాలం నుంచి గుంతలు మిట్టలతో రోడ్లు నరకం చూపుతున్నాయి. గత పాలకుల హయాంలో రోడ్లు వేయడం ప్రారంభించారే తప్ప పూర్తిచేయకపోవడం, కొత్త ప్రభుత్వం వచ్చినా నగరంలోని అనేకరోడ్లు నేటికీ ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.***

రోడ్ల మీద ఉన్న ఈ గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో, ఎక్కడ గుంతలున్నాయో అర్థం కాక వాహనాల వారు, పాదచారులు ఎన్నో అవస్థలు పడుతూనే ఉన్నారు. కొన్నిచోట్ల పాతరోడ్లు లేచిపోయి గులకంతా బయటకువచ్చి పాదచారులు నడిచేందుకు ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాలు, సందులు గొందుల్లో అంతా ఇదే పరిస్థితి. గతంలో పాలకులు రోడ్లు వేశామన్నారే కానీ.. ఏ వీధి చూసినా పరమ దౌర్భాగ్యంగానే ఉంది. కాలం గడిచిపోతూనే ఉన్నా ఈ రోడ్ల అతీగతీ పట్టించుకోకపోవడంతో ఈ గుంతలు చివరికి మురికిగుంతలుగా మారుతున్నాయి. ఇవి దోమల నిలయాలవుతున్నాయి. నెల్లూరులోని ప్రధాన రోడ్లలో కూడా ఇదే దుస్థితి.

**పట్టించుకునే నాధులేరీ?..**

నగరంలో ప్రధానమైన ట్రంకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న అనేక వీధులతో పాటు, ఏసినగర్, బాలాజీనగర్, రామ్మూర్తినగర్, ప్రధాన వీధుల చీలు రోడ్లు..ఆ చుట్టుపక్కల ఉన్న రోడ్లు, నేతాజీ నగర్, వెంగళరావునగర్, పోస్టల్‌కాలనీ, దర్గామిట్ట, మాగుంట లే అవుట్, కరెంటాఫీస్‌సెంటర్ ప్రాంతంలోని అనేక రోడ్లు, ఎ.కె నగర్ రోడ్లు, పలు కాలనీల్లో ఉన్న రోడ్లు..ఇలా ఎక్కడ చూసినా రోడ్లు పరమ రోతగా ఉంటు న్నాయి. ఏ వీధి చూసినా ఏమున్నది గర్వ కారణం.. గుంతలు, రోడ్లమీదకి పొర్లు తున్న డ్రైనేజీ కాలువలు తప్ప..అన్నట్లుగా తయారైంది పరిస్థితి. రోడ్ల అతీగతీ పట్టించుకునే నాధులే కరువయ్యారని నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాగరికతకు చిహ్నాలు రోడ్లే కనుక, మన నెల్లూరు సుందరనగరం కావాలంటే ముందు రోడ్లు బాగుండాలి.

ఇకనైనా జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు నెల్లూరునగర రోడ్ల దుస్థితిని పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# శిక్షణ తీసుకోండి.. ఉద్యోగం పొందండి

## రాష్ట్రంలో మొట్టమొదటి నైపుణ్య శిక్షణ కేంద్రం.. శ్రీసిటీలో ప్రారంభం




రాష్ట్రంలో మొట్ట మొదటగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్–శ్రీసిటీ సంయుక్తంగా ఏర్పాటుచేసిన పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ నియామక కేంద్రం శ్రీసిటీలో ప్రారంభం కావడం విశేషం. ఈ కేంద్రాన్ని ఈనెల 7న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగం కల్పించే ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్న ఎపిఎస్ఎస్‌డిసి–శ్రీసిటీ యాజమాన్యాలను అభినందించారు. చదువులకు తగ్గ ఉద్యోగాలు రాక ఏళ్ళతరబడిగా ఎదురుచూస్తూ ఖాళీగా ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కేంద్రం రాష్ట్రంలోని ఇతర సెజ్‌లు, పారిశ్రామికవాడలకు మార్గదర్శకం కానుందన్నారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఈ తరహా నైపుణ్యశిక్షణ కేంద్రం ఏర్పాటు రాష్ట్రంలో తొలిసారిగా శ్రీసిటీలో చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. శ్రీసిటీలోని పలు కంపెనీలు ఇందుకు సహకరిస్తున్నందుకు ఆయన సంతోషం వెలిబుచ్చారు. ఎపిఎస్ఎస్‌డిసి ఛైర్మెన్ చల్లా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా వివిధ రంగాల్లో పరిశ్రమలకు అనువైన రీతిలో యువతను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ఎస్‌డిసి సిఇఓ డాక్టర్ ఆర్జా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 30 మంది డిప్లొమా పూర్తిచేసిన వారికి ఆల్‌స్టామ్ పరిశ్రమలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేశామని, శిక్షణ సమయంలో వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని, నెలరోజుల శిక్షణ అనంతరం వారికి అదే పరిశ్రమలో వెంటనే ఉద్యోగం కల్పిస్తారని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పరిశ్రమల వర్గాలు తెలిపాయి.

# కరోనాతో జిల్లా కకావికలం

- 57వేలు దాటిన కేసులు
- 539కి చేరిన మృతులు

జిల్లాలో కరోనా వ్యాధి విస్తరిస్తూనే ఉంది. వైద్యులు, అధికార యంత్రాంగం అందరూ ఈ వ్యాధి నివారణకు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నా, ఈ వ్యాధి ఇంకా విజృంభిస్తూనే ఉంది. ఈనెల 7వ తేది నాటికి కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 57,013కు చేరుకోగా, కరోనా మృతుల సంఖ్య 539 మందికి చేరింది. చికిత్సలు పొంది ఇప్పటిదాకా 52,749 మంది డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 3725 మంది వివిధ ఆసుపత్రులు, కోవిడ్ సెంటర్లలో చికిత్సలు పొందుతున్నారు. గత 24 గంటల్లో 4,819 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, 367 మందికి పాజిటివ్ వచ్చిందని, వీరిలో 80 మందిన నెల్లూరు పెద్దాసుపత్రి, అపోలో, మెడికవర్, రెయిన్‌బో, నెల్లూరు ఆసుపత్రులతో పాటు కోవిడ్‌కేర్ సెంటర్లకు తరలించినట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. మిగిలినవారిని హోం ఐసొలేషన్లలో ఉంచి ఆరోగ్య కార్యకర్తల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు అధికారవర్గాల వారు చెప్తున్నారు.

### విఎస్‌యులో కలకలం

నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీలో నలుగురు విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఈనెల 7 నిర్వహించాల్సిన ఎంబిఏ చివరి సెమిస్టర్ పరీక్ష వాయిదా వేస్తున్నట్లు విఎస్‌యు అధికారులు ప్రకటించారు. విఎస్‌యులో ఎంబిఏ చదువుతున్న విద్యార్థులకు మూడురోజుల కిందట కరోనా పరీక్షలు నిర్వహించగా నలుగురికి పాజిటివ్ రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కళాశాలకు సెలవిచ్చి తరగతి గదులన్నిటినీ శానిటేషన్ చేయించారు. మిగిలిన విద్యార్థులు కూడా కరోనా పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో విఎస్‌యులో కలకలం చెలరేగింది.


















Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com